6 పేజీలు: 7 నయాపైసలు ANDHRA JANATHA

HYDERABAD Regd No: H.031

ఆంధ్రజనత

హైదరాబాద్, ఆదివారం 20-9-1959

సంపాదకుడు: కే. యస్. సుబ్రహ్మణ్యం

సంపుటి 5 సంచిక 86

ముద్దులొలికే మీ పిల్లలు

మా సరికొత్త షర్టులు, బుష్‌షర్టులు, నైలాన్, టెరిలీన్, ప్రింటెడ్ కాటన్ ఫ్రాకులు, బాబా సూట్లు బీచ్‌వేర్, వర్కింగ్‌వేర్‌లను ధరించినట్లయితే ఇంకా ముచ్చట గొలుపుతూ ఉంటారు.

నేడే ఒకసారి వచ్చి చూసుకోండి

బుల్ చంద్ అండ్ కో

"సర్క్యులేస్", ఆబిడ్ రోడ్, ఫోన్: 4233

(Khn & Sons)



రాష్ట్రంలో ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం ప్రోత్సాహం

వరద బాధితులకు సహాయం

శ్రీ ఎన్. జి. గోరే విజ్ఞప్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19

సూరత్, ఆంధ్ర, విదర్భ ప్రాంతాలలో వరద బాధితులకు వస్తు రూపంలోనో, ధన రూపంలోనో చేతనైనంత సహాయం చేయవలసిందిగా ప్రజాసోషలిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్. జి. గోరే నేడు పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేసారు.

వరద బాధితుల కోసం మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్ర, పి. ఎస్. పి. శాఖలు ఇతర సంస్థలతో కలసి కృషి చేయనున్నట్లు వినటంలో సందేహం లేదని ఆయన అన్నారు.

స్థానికాభివృద్ధి కార్యక్రమాలకు చేయూత

కాంగ్రెస్ కార్యకర్తలకు నాయకుల ఉద్బోధ

హైదరాబాద్, సెప్టెంబర్ 19

ఆంధ్ర ప్రదేశ్ యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిన్న సాయంత్రం గాంధీ భవన్‌లో శ్రీ పి. జనార్దన రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శులు శ్రీ వల్లూరు బసవరాజు, యన్. రామచంద్రారెడ్డి, ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డి, శాసన పరిషత్తు సభ్యులు శ్రీ పి. వెంకట్రామయ్య గారలు కూడ సమావేశంలో పాల్గొన్నారు.

అక్టోబర్ నుంచి డిసెంబర్ మాసాంతంలో రాష్ట్ర వ్యాప్తంగా సభ్యుల చేర్పించే కార్యక్రమం జరగాలనీ, అటు పిమ్మట యువజన కాంగ్రెసు ఎన్నికలు జరగాలని నిర్ణయించారు. ప్రతి తాలూకాలోను కనీసం వంద మంది సభ్యులనైనా చేర్పించాలని నిర్ణయించారు.

కలరా, మలేరియా, మశూచికం లాంటి అంటు వ్యాధుల నిర్మూలనా కార్యక్రమంలో యువజన కాంగ్రెసు సేవకులు చురుకుగా పాల్గొనాలనియు, హెల్తు శాఖ డైరెక్టర్ సలహాతో యిందుకు తగిన కార్యక్రమం నిర్ణయించాలని తీర్మానించారు.

వివిధ సంస్థలకు ప్రాతినిధ్య మిస్తూ 12 గురిని కార్యవర్గంలోనికి కోఆప్ట్ చేసుకున్నారు.

అధికార వికేంద్రీకరణ జరుగుతున్న యీ తరుణంలో యువ కాంగ్రెసు సేవకులు పంచాయతీలు పంచాయతీ సమితులు, వాటి ద్వారా జరిగే స్థానికాభివృద్ధి కార్యక్రమాలలో యువకులు చొరవ తీసుకుని పని చేయాలని ఆర్థిక మంత్రి కార్యవర్గ సభ్యులకు నుద్బోధించారు.

అన్ని స్థాయిలలోను పటిష్టమైన సంఘోప సంఘాలు నిర్మాణం జరగాలని శ్రీ వి. వి. రాజగారన్నారు.

గ్లాస్కో (స్కాట్లండ్), సెప్టెంబర్ 19

ఇక్కడ ఒక బొగ్గుగనిలో అగ్ని ప్రమాదం ఫలితంగా 47 మంది మరణించారు.

శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ప్రకటన

విదేశ మారకద్రవ్యం చిక్కులు ఉండవని హామీ

సంగాల్, సెప్టెంబర్ 19

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణం విషయమై కార్యక్రమం కొనసాగాలని కేంద్రం నిశ్చయించినట్టు వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నేడు ఇక్కడ వెల్లడించారు.

చేతి పనులు, గృహ పరిశ్రమల శాల (ప్రభుత్వ విక్రయశాల)కు ప్రారంభోత్సవం చేసిన సందర్భంలో ఆయన పై విషయాన్ని వెల్లడించారు.

రాజమండ్రి పేపర్ మిల్స్ విస్తరణ పథకాలు కూడా పూర్తయినట్టు శ్రీ శాస్త్రి వెల్లడించారు.

సభకు ముఖ్య మంత్రి శ్రీ సంజీవ రెడ్డి అధ్యక్షత వహించారు.

ఎరువుల ఫ్యాక్టరీ విషయమై శ్రీ శాస్త్రి చేసిన ప్రకటన పట్ల రాష్ట్ర ప్రజలంతా తృప్తి, కృతజ్ఞత ప్రకటించగలరని శ్రీ సంజీవ రెడ్డి అన్నారు.

ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణానికి సుమారు 30 కోట్ల రూపాయలు ఖర్చు కాగలదని అంచనా వేసారు.

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల అభివృద్ధికి ఇతోధిక అవకాశాలు కలవని శ్రీ శాస్త్రి అన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి విషయమై శ్రీ శాస్త్రి నేడు ముఖ్య మంత్రితో చర్చలు జరిపారు. రాజమండ్రిలో పేపర్ మిల్స్ విస్తరణ విషయమేగాక, రాష్ట్రంలో మరో పేపర్ మిల్లు స్థాపించటానికి అవకాశాలు ఉన్నవేమో పరిశీలించ వలసిందిగా శ్రీ శాస్త్రి ముఖ్యమంత్రిని కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించిన ఎరువుల ఫ్యాక్టరీ నిర్మాణం జరగాలని కేంద్రం నిశ్చయించినట్టు శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ప్రకటించారు. రాష్ట్రంలో అధికాహారోత్పత్తికి ఎరువుల ఫ్యాక్టరీ అవసరం. ఫ్యాక్టరీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవటం ఎంతైనా హర్షనీయం. రాష్ట్రం నిర్మిస్తున్న మొదటి ఫ్యాక్టరీ ఇదే. విదేశ మారక ద్రవ్యం విషయంలో ఒక మార్గాన్ని అన్వేషించాం. ఇక ఈ విషయమై చిక్కు ఉండదు. అని ఆయన అన్నారు.

ఫ్యాక్టరీ నిర్మాణం త్వరలో నే ప్రారంభం కాగలదని ఆయన ఆశాభావం ప్రకటించారు.

అన్నిరకాల పరిశ్రమల విషయంలో దేశంస్వయం సమృద్ధిసాధించటానికిగాను ఉక్కు మొదలైన భారీ పరిశ్రమలను అభివృద్ధి పరచటం అవసరమని ఆయన అన్నారు. వివిధ రాష్ట్రాల్లో చిన్న తరహా ఉక్కు పరిశ్రమలను స్థాపించే విషయం ఆలోచించ వలసి ఉన్నదని ఆయన అన్నారు. ఇందువల్ల రవాణా ఇబ్బందులు తొలగిపోయి, ధరలు కూడా తగు మాత్రం తగ్గ గలవని కూడా ఆయన అన్నారు.

దేశంలో పారిశ్రామిక అభివృద్ధికి గాను లఘు పరిశ్రమలు ఎంతైనా అవసరమనీ, ప్రతి రాష్ట్రంలోనూ భారీ పరిశ్రమలను నెలకొల్పటం సాధ్యం కాదనీ ఆయన అన్నారు. ప్రజలకు లఘు పరిశ్రమల పట్ల ఉత్సాహం కల్పించాలనీ, అందువల్ల నిరుద్యోగం కూడా కొంత వరకు నివారణ కాగలదనీ ఆయన అన్నారు.

చేతిపనుల ఉత్పత్తిని పెంపొందించి, ఎగుమతుల ద్వారా విదేశ మారక ద్రవ్యాన్ని ఆర్జించాలనీ, అందువల్లనే తృతీయ ప్రణాళికలో లఘు పరిశ్రమలకు ఇతోధిక ప్రాముఖ్యం ఇవ్వబడుతుందనీ ఆయన అన్నారు.

లఘు పరిశ్రమల ఉత్పత్తులకు అమ్ముడు పోవనే భయం లేదని ఆయన హామీ ఇచ్చారు.

ఇటీవల చికాగో సంతలో భారత ప్రదర్శనశాల 1.5 కోట్ల రూపాయల మేరకు ఆర్డర్లను సేకరించినట్టు ఆయన తెలియ జేసారు.

కుటీర, లఘు పరిశ్రమలను పల్లె ప్రాంతాలలో ప్రోత్సహించాలని శ్రీ సంజీవ రెడ్డి అధ్యక్షోపన్యాసంలో అన్నారు. అవసరమైతే శాసనం ద్వారానైనా చేతి పనులకు, కుటీర పరిశ్రమలకు రక్షణ కల్పించాలని ఆయన సూచించారు.

అంతకు ముందు రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీ భగవంతరావు కేంద్ర మంత్రికి స్వాగతమిచ్చారు. రాష్ట్రంలో చేతి పనులు, కుటీర పరిశ్రమల ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు.

కేరళ రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తత

కమ్యూనిస్టు పార్టీ ఆరోపణ

ట్రివేంద్రం, సెప్టెంబర్ 19

రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతను కొనసాగించటానికి కాంగ్రెస్ తదితర రాజకీయ పక్షాలన్నీ కుట్ర పన్నాయని కేరళ కమ్యూనిస్టు పార్టీ నేడు ఆరోపించినది.

అందు వల్లనే, వచ్చే ఎన్నికలు శాంతంగా జరగాలనే సంయుక్త విజ్ఞాపన పత్రంపై సంతకాలు చేయటానికి రాజకీయ పక్షాలు నిరాకరించాయని ప్రకటనలో కమ్యూనిస్టులు ఆరోపించారు.

శాంతి సంరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ సదా సంసిద్ధతను ప్రకటించినదని ఇతర రాజకీయ పక్షాలన్నీ అలా చేయటం లేదనీ ప్రకటనలో విమర్శించారు.

కాంగ్రెస్ తదితర పక్షాలు హింసాత్మక చర్యలను విరమించేటట్టు పలుకుబడిని ఉపయోగించ వలసిందిగా గవర్నర్‌కు కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి చేసినది.

లావోస్ పోరాటం

వియన్‌టైన్, సెప్టెంబర్ 19

సామ్‌నువా రాష్ట్రంలో కెల్లా కీలకమైన కోట సామ్‌టువాను కమ్యూనిస్టు తిరుగుబాటు దళాలు తిరిగి ఆక్రమించుకొన్నాయి.

రాష్ట్రంలో ఉభయ వర్గాలకు మధ్య తీవ్రంగా పోరాటం జరుగుతున్నది.

గత బుధవారంనాడు ఈ కోటను రాయల్ దళాలు తిరుగుబాటుదార్ల నుంచి వశపరచుకొన్నారు.

గత శుక్రవారం నాడు పిల్లానాలో "బాల సర్వోదయ పాత్ర"కు గవర్నర్ శ్రీ సచార్ ప్రారంభోత్సవం చేసిన దృశ్యం.

వేతనాల సంఘం సిఫార్సులు

ఆర్థిక మంత్రి లేఖకు శ్రీ సుందరయ్య సమాధానం

విజయవాడ, సెప్టెంబర్ 18

వేతనాల సంఘం కార్యకలాపాలలో గాని, తర్వాత సిఫార్సుల సవరణ కోసం జరిగిన ఆందోళనలో గాని తాను, తన పార్టీ కూడా నాన్ గెజిటెడ్ ఉద్యోగులను మోసగించలేదని అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య నిన్న రాత్రి ఇక్కడొక ప్రకటనలో వివరించారు.

వేతనాల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి గారి లేఖకు సమాధానంలో ఆయన పై వివరణ చేసారు.

శ్రీ సుందరయ్య లేఖలో ఇలా పేర్కొన్నారు:

"నాకు చేతనైనంత నేను చేసానన్నే తృప్తి నాకు ఉన్నది. ఉపాధ్యాయులకు, సుశిక్షితులైన ఉద్యోగులకు న్యాయం జరగనందుకు నాకు అసంతృప్తిగా ఉన్నది. తోటి ఉద్యోగులకు జరిగినంత న్యాయమైనవారికి జరగ లేదు. సిఫార్సుల పైన అభిప్రాయం ప్రకటించ వలసిన వారు ఎన్.జి.ఓ.లు. తృప్తికరమా కాదా నిర్ణయించ వలసినది వారే"

వేతనాల సంఘం సమాలోచనలలో ఉపాధ్యాయులు, ఇతర ఎన్. జి. ఓ.ల జీత భత్యాల విషయమై తాను చేసిన సూచనలను ఆయన వివరించారు. తన సూచన లన్నింటినీ అధ్యక్షుడు వ్యతిరే

(మిగత 6 వ పేజీ)

కృశ్చేవ్ నిరాయుధీకరణ పథకానికి ఆసియా, ఆఫ్రికా వర్గాల హర్షం

ప్రతిపాదనలో కొత్త విశేషం ఏమీ లేదని హెర్టర్ వ్యాఖ్య

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబర్ 19

నాలుగేళ్లలో ప్రపంచం అంతటా సైనిక దళాలనూ, ఆయుధాలనూ పూర్తిగా రద్దు చేయటానికి సంబంధించి సోవియట్ ప్రధాని శ్రీ నికిటా కృశ్చేవ్ నిన్నటి దినం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో చేసిన ప్రతిపాదనల పట్ల ఆఫ్రికా, ఆసియా వర్గాలు నేడు సుముఖాభిప్రాయాన్ని వెల్లడించినవి.

ఐదుగు దేశాల ఆర్థికాభివృద్ధికి దోహదం చెయ్యాలని శ్రీ కృశ్చేవ్ నొక్కి చెప్పినందుకు కూడా పై వర్గాల వారు సంతోషాన్ని వెల్లడించారు.

"అంతాచర్విత చర్వణం"

పశ్చిమ రాజ్యాల వారి వ్యాఖ్యానాలు

న్యూయార్క్, సెప్టెంబర్ 19

నాలుగేళ్లలో ప్రపంచంలో ఎక్కడా సేనలనేవి లేకుండా చెయ్యటానికిగాను సోవియట్ ప్రధాని శ్రీ కృశ్చేవ్ చేసిన ప్రతిపాదనలను గురించి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశంకు వచ్చిన విదేశాంగ మంత్రులు, డెలిగేట్లు వారి వారి ప్రభుత్వాలతో సమాలోచనలు ప్రారంభించారు.

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశం తిరిగి సోమవారం ప్రారంభమైనప్పుడు, డెలిగేట్ల సంభాషణల్లో శ్రీ కృశ్చేవ్ ప్రతిపాదనలు ప్రధాన చర్చనీయాంశాలు కాగలవని అనుకుంటున్నారు.

నేడు లండన్ వెళుతున్న బ్రిటిష్ విదేశాంగ మంత్రి శ్రీ సెల్విన్ లాయిడ్ జనరల్ అసెంబ్లీలో శ్రీ కృశ్చేవ్ చేసిన ప్రసంగం పూర్తిపాఠాన్ని శ్రద్ధగా పరిశీలిస్తున్నారు.

శ్రీ కృశ్చేవ్ ప్రతిపాదనలో కొత్త విశేషం ఏమైనా ఉన్నదా అని ప్రశ్నిం

(మిగతా 6 వ పేజీలో)

ధవళేశ్వరం వద్ద గోదావరి మట్టం మరి 2 అడుగులు తగ్గుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 19

ధవళేశ్వరం ఆనకట్ట వద్ద గోదావరి నీటి మట్టం నేటి సాయంత్రం 7 గంటల సమయానికి 16.8 అడుగులకు తగ్గినది.

ఆనకట్ట వద్ద ఈ యేడు నీటి మట్టం క్రమక్రమంగా తగ్గి పోవ గరిష్ఠ మట్టం 18.8 అడుగులు అంటే టం వల్ల గంపం పూర్తిగా గడిచినట్టే. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఒక రాత్రిలో నీటి మట్టం ఒక అడుగు పడిపోయినది.

భద్రాచలం వద్ద 62.6 అడుగుల నుంచి 54.7 అడుగులకు, కూనవరం వద్ద 65.7 అడుగుల నుంచి 58.5 అడుగులకు నీటిమట్టం తగ్గిపోయినది.

ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం త్వరగా తగ్గిపోయినప్పటికీ, శబరినది వరదలవల్ల రాజమండ్రి, ధవళేశ్వరం వద్ద నీటి మట్టం నెమ్మదిగా తగ్గుతున్నది.

నది పక్క ప్రాంతాల నుంచి వచ్చిన వార్తల ప్రకారం యేటిగట్టు గట్టిగానే ఉన్నదనీ, ఇంకెక్కడా గండ్లు పడలేదనీ, వరద బాధితులకు ప్రభుత్వ సహాయం చురుకుగా అందుతున్నదని తెలుస్తున్నది.

సెప్టెంబర్ 17వ తేదీన సాయంత్రం 5 గంటల నుంచి నీటిమట్టం తగ్గటం ప్రారంభించినది.

రాజమండ్రి బ్రిడ్జిపై రైలు ప్రయాణాలు తిరిగి ప్రారంభం

మద్రాసు, సెప్టెంబర్ 18

గోదావరి వంతెన మీదుగా రైళ్ళ రాకపోకలు యీ సాయంత్రం నుంచి వాల్తేరు-విజయవాడ సెక్షన్‌లో తిరిగి ప్రారంభమైనాయి. కావున ఒక్క మద్రాసు-ఢిల్లీ జనతా ఎక్స్‌ప్రెస్ తప్ప ఈ సెక్షన్ మీదనున్న రైళ్ళు మామూలుగా నడుస్తాయి. ఈ జనతా ఎక్స్‌ప్రెస్ మాత్రం 19 తేదీ నుంచి గుంతకల్లు, రాయచూర్, ధోండ్, మన్మాడ్ ల మీదుగా ఇటార్సీ వద్ద మామూలు త్రోవలో కలుస్తుంది. మద్రాసు నుంచి హైదరాబాద్ వెళ్ళే ప్రయాణీకులకు ప్రత్యేకంగా కలకత్తా మెయిలును ఒక పెట్టె తగిలించి, దాన్ని విజయవాడలో వదలితే, దాన్ని సికింద్రాబాద్ ఎ్యాసింజర్‌కు తగిలిస్తారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్ళే ప్రయాణీకులు వాడీ వద్ద జనతా రైలు ఎక్కవలసి ఉంటుంది. వీరికొరకు ప్రత్యేక కంపార్టు మెంటులు వుంటాయి వాడీ రైలులో.

సూరత్ పట్టణంలో వరదలు తగ్గుముఖం

మృతుల సంఖ్య 60 వరకు పెరుగుదల

సూరత్, సెప్టెంబర్ 19

సూరత్ పట్టణంలో చాలా భాగాన్ని ముంచివేసిన తాపీ వరదలు క్రమంగా తగ్గుతున్నాయి.

పట్టణంలో రాకపోకలు, రవాణా స్తంభించాయి. వరదల వల్ల మరణించిన వారి సంఖ్య నేడు 60 వరకు పెరిగినట్టు తెలుస్తున్నది.

ఎట్టి సందర్భంలోనూ మృతులసంఖ్య 150 కంటే పెరగదని అధికార ప్రతినిధి ఒకరు అన్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందో ఇప్పుడే చెప్పటం కష్టమని ఆయన అన్నారు.

వరద బాధితులకు అత్యవసర సహాయం అందజేయ బడుతున్నది.

పండిట్ గోవింద వల్లభపంత్ బొంబాయి ప్రభుత్వానికి ఒక లేఖలో కేంద్ర ప్రభుత్వం సహాయంచేయటానికి సిద్ధంగా ఉన్నదని తెలియజేసారు.

సూరత్ పట్టణానికి ఉత్తర దిశగా 12 మైళ్ళ మేర రైలు కట్ట పూర్తిగా కొట్టుకొని పోయినది. రైలు కట్టను బాగు చేయటం ఇప్పట్లో అయ్యే పని కాదని అధికారులు భావిస్తున్నారు.

సూరత్ వరద పీడితుల సహాయార్థం మైసూరు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వారు నేడు బొంబాయి ముఖ్యమంత్రి శ్రీ ఛవాన్‌కు రు. 1001 లు విరాళం పంపారు.

ఇండియా-ఇరాన్ స్నేహ సంబంధాలు

తిరిగి సర్వ విధాలా పెంపొందించు కోవాలని ప్రధాని నెహ్రూ ఉద్ఘాటన

టెహరాన్, సెప్టెంబర్ 11

ఇండియా, ఇరాన్ దేశాలు తమ పూర్వ సంబంధాలను పునరుద్ధరించుకొని సమిష్టి శ్రేయస్సుకోసం కలసిమెలసి కృషి చేయగలవని ప్రధాని నెహ్రూ నిన్నరాత్రి ఇక్కడ ఆశాభావం ప్రకటించారు.

భారత ప్రధాని గౌరవార్థం నిన్న రాత్రి ఇరాన్ ప్రధాన మంత్రి డాక్టర్ ఇక్బాల్ విందు చేసారు. విందు సందర్భంలో శ్రీ నెహ్రూ పై విధంగా ఆశాభావం ప్రకటించారు. గతంలోనే గాక, ఇప్పుడు, ఇక ముందు కూడా ఇరాన్, భారత దేశాలు సమైక్య కృషి జరపగలవని శ్రీ నెహ్రూ అన్నారు.

నాలుగు సంవత్సరాల క్రితం ఇరాన్ రాజు భారత దేశాన్ని సందర్శించటం వల్ల, ప్రధాని నెహ్రూ ఇప్పుడు టెహరాన్ రావటం వల్ల ఉభయ దేశాల సంబంధాలు మరింత దృఢతరం కాగలవని డాక్టర్ ఇక్బాల్ తన ప్రసంగంలో అన్నారు.

పత్రికలలో గాని, ప్రసంగాలలోగాని కనిపించని కొన్ని నాగరికత సమస్యలు ఇరాన్, ఇండియా వంటి దేశాలను ఎదుర్కొంటున్నాయని శ్రీ నెహ్రూ అన్నారు. పత్రికలు ఇప్పటి సమస్యలనే పరిశీలిస్తుంటాయి. అయితే అంతకు మించిన ప్రధాన సమస్యలు ఉంటాయి. దేశాల ప్రాచీన దృక్పథం, నాగరికతలను, ప్రస్తుత దేశ కాలస్థితిగతులకు సంబంధం ఉంటుందని ఆయన అన్నారు.

డాక్టర్ ఇక్బాల్ తన ప్రసంగంలో సమితి నిబంధనల పట్ల తమకు విశ్వాసం ఉన్నదన్నారు.

భారతీయులకు ఉద్బోధ

ప్రధాని నెహ్రూ స్థానిక భారతీయుల సమావేశంలో కూడా ప్రసంగించారు. భారత దేశం గౌరవ ప్రతిష్ఠలను కాపాడాలనీ, దేశ దేశాలతో సంబంధాలు పెంపొందించుకొనాలనీ ఆయన ఉద్బోధించారు.

స్థానిక చిత్రకారుడొకరు పెన్సిల్‌తో ప్రధాని నెహ్రూను చిత్రించి ఆయనకు బహూకరించారు.

జనరల్ గ్రీవాస్ అరెస్టుకు గ్రీక్ ప్రభుత్వ సంకల్పం?

ఏథెన్స్, సెప్టెంబర్ 19

గ్రీక్ ప్రభుత్వం తనను అరెస్టు చేయటానికి సంకల్పించినట్టు మాజీ ఇయోకా నాయకుడు జనరల్ జార్జి గ్రీవాస్ నేటి రాత్రి ఇక్కడ ఒక ప్రకటనలో ఆరోపించారు.

గ్రీస్‌లో సైనిక విప్లవానికి తాను ప్రయత్నిస్తున్నాననే సాకుతో ప్రభుత్వం తనను అరెస్టు చేయటానికి సంకల్పించినదని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రెస్ విషయమై చర్చలు జరపటానికిగాను ఆర్చిబిషప్ మెకారియోస్‌ను ఆయన మరోసారి ఆహ్వానించారు.

కరాచీ సుందరి పై హత్యానేరం

కరాచీ, సెప్టెంబర్ 19

గత ఫిబ్రవరి మాసంలో ఒక డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటును హత్య చేయుటలో తన తండ్రితో పాటు కరాచీ సుందరి విరుదాంకితురాలైన అఖ్తారీ బేగమ్ (24 సం.) తీయగూడా వుందని కరాచీ జడ్జి కోర్టు జ్యూరీ సభ్యులు నిర్ణయించారు. జడ్జి 24 వ తేదీ తీర్పు యిస్తారు.

తాజావార్తలు

లాస్ ఏంజల్స్, సెప్టెంబర్ 19

సోవియట్ ప్రధాని కృశ్చేవ్ లాస్ ఏంజల్స్ చేరుకున్నారు.

* * *

రాజమండ్రి, సెప్టెంబర్ 19

గోదావరి మట్టం రెండు అడుగులు తగ్గిన ఫలితంగా రాజమండ్రి ప్రజలలో ఆందోళన కూడా తగ్గిపోయి, ప్రశాంత వాతావరణం నెలకొంటున్నది

పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై విశ్వాస రాహిత్యం తీర్మానానికి ప్రతిపక్షాల నోటీసు

కలకత్తా, సెప్టెంబర్ 19

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపైన, ఆహార మంత్రి శ్రీ పి.సి. సేన్ పైన నేడు అసెంబ్లీలో ప్రజాసోషలిస్టుపార్టీ తప్పించి ఇతర ప్రతి పక్షాలు విశ్వాసరాహిత్య తీర్మానానికి నోటీస్ ఇచ్చాయి.

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ సమావేశం సెప్టెంబర్ 21వ తేదీన సమావేశమౌతుంది. సమావేశాలు పదిరోజుల పాటు జరుగుతాయి.

పై విశ్వాస రాహిత్య తీర్మానం పట్ల పి.ఎస్.పి. తన వైఖరిని రేపు ప్రకటిస్తుంది.

ఆయుర్వేదౌషధములు.
శాస్త్రీయముగాను నమ్మకముగాను తయారుచేయు సంస్థ
వేంకటేశ్వర ఆయుర్వేదనిలయం.
చింతలూరు
ఆలమూరు పోస్టు ★ తూర్పుగోదావరిజిల్లా.
ఆంధ్రదేశమందంతటను బ్రాంచులు, ఏజన్సీలు కలవు.
(1) 7-2-148, హిస్సామ్‌గంజ్ రోడ్, పాత పోలీస్ స్టేషన్ రోడ్ ఎదుట, సికిందరాబాద్.
(2) 712, సెంట్రల్ బ్యాంక్ బిల్డింగ్స్, హైదరాబాద్.

VIJAY SAREES & SPECIALITY
SALES EMPORIUM
SULTAN BAZAR
FIXED PRICE CLOTH SHOP



వికారినామ సంవత్సరం

ఆదివారం, సెప్టెంబర్ 20-1959
భాద్రపద తదియ
తదియ ఉ॥ 8-00
అశ్వని సా॥ 5-9
వర్జ్యం మ॥ 12-50 మొ॥ రా॥ 3-40 కు

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు: 4950

ఆదివారం, సెప్టెంబర్ 20, 1959

ఆల్జీరియా సమస్య

ఆల్జీరియాలో శాంతి ఏర్పడిన నాలుగేళ్ళ తర్వాత ఆల్జీరియా ప్రజలకు స్వయం నిర్ణయాధికార హక్కును లభింపజేయగలనని ఫ్రాన్స్ అధ్యక్షుడు జనరల్ డిగాల్ ప్రకటించారు. శాంతి ఏర్పడటం అంటే ఏమిటో జనరల్ డిగాల్ నిర్వచించారు. ఆల్జీరియా తిరుగుబాటు దారులు, ఫ్రెంచి సైనికులు ఒండొరులపై జరుపుకొనే దాడుల ఫలితంగా చనిపోతున్న వారి సంఖ్య యేడాదికి 200 మించక పోయినట్లయితే, అప్పుడు శాంతి ఏర్పడినట్లు తాను భావిస్తానని డిగాల్ అన్నారు. (ప్రస్తుతమైతే ఫ్రెంచివారు సాగిస్తున్న హత్యాకాండ వల్లనైతేనేమి, విప్లవ వీరుల పోరాటం వల్లనైతేనేమి, ఆల్జీరియాలో రక్తపాతం అతిఘోరంగా ఉన్నది. ఇటీవల నెలా పదిహేను రోజుల్లో సుమారు 600 మంది మృతి నొందారు) అతి దారుణంగా పరిణమించిన ఈ ప్రాణనష్టం మాట అటుంచి, ఆల్జీరియా ఆర్థికంగా కూడా ఫ్రాన్స్‌కు పెద్ద భారంగా ఉన్నది. ఆల్జియర్స్‌లో సైనిక తిరుగుబాటుకు, ఫ్రాన్స్‌లో ఒక రిపబ్లిక్ అంతరించి మరొక రిపబ్లిక్ అవతరించటానికి కూడా ఈ సమస్య కారణభూతమైనది. జనరల్ డిగాల్ పథకం యొక్క బాగోగుల విషయంలో అభిప్రాయ భేదాలు ఉండవచ్చు కాని, అది ఒక విషయాన్ని మాత్రం స్పష్టం చేస్తున్నది. అది ఏమిటంటే ఆల్జీరియా సమస్యకు వెంటనే ఏదో ఒక పరిష్కార మార్గాన్ని అన్వేషించటం అత్యవసరమని డిగాల్ గుర్తించారు. ఇంతే కాదు. సైనిక చర్యల ద్వారా ఆల్జీరియా తిరుగు బాటును అణచి వేయటం అసాధ్యమని, ఆల్జీరియా ప్రజల జాతీయ హక్కులను గుర్తించటం తప్పనిసరి అని కూడా డిగాల్ గ్రహించారు. అయితే, ఇందుకు ఆయన పథకం ఎంత వరకు అనుగుణ్యంగా ఉన్నదనేదే ప్రశ్న.

ఆల్జీరియా విషయంలో ఫ్రాన్స్‌కు, తక్కిన పశ్చిమ రాజ్యాలకు, ముఖ్యంగా అమెరికాకు మధ్య తీవ్ర అభిప్రాయ భేదాలు ఏర్పడినట్టు అందరికీ తెలుసు. ఆల్జీరియాలో ఫ్రెంచి సామ్రాజ్య వాదాన్ని బలపరచాలని ఫ్రాన్స్ కోరిక. దీనిని మన్నించ జాలమని, అలా చేస్తే ప్రపంచంలో తలెత్తుకొని తిరగలేమని అమెరికావారు ఇదివరలో స్పష్టం చేశారు. అయితే, ఆల్జీరియా సమస్య మూలంగా ఫ్రాన్స్‌తో నేస్తం చెడగొట్టుకొనటం అమెరికాకు ఇష్టం లేదు. అందుచేత, ఇటీవల ఫ్రాన్స్ అధ్యక్షుడు జనరల్ డిగాల్‌తో అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ చర్చలు జరిపారు. ఈ చర్చలలో ఉభయులు చెరొక మెట్టు దిగినట్టు వినికిడి. (లేదా డిగాల్ మరికొన్ని మెట్లు దిగి ఉండవచ్చు.) అందుచేత ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ ఫ్రెంచి అధ్యక్షుని పథకాన్ని బలపరచటంలో ఆశ్చర్యం లేదు.

పైకి చూస్తే, డిగాల్ పథకం ఆమోదయోగ్యం గానే కనిపిస్తుంది. పూర్వం వలె ఆల్జీరియన్లు పోరాటాన్ని విరమిస్తేనేగాని ఎవరితోనూ ఎట్టి సంభాషణలు జరపనని అనటం లేదిప్పుడు జనరల్ డిగాల్. సంపూర్ణ స్వాతంత్ర్యం పొంది, ఫ్రెంచి సామ్రాజ్యం నుంచి విడిపోవటానికి ఆల్జీరియాకు గల హక్కును గుర్తించారు; అందుకు అవకాశం కల్పించారు. ఫ్రాన్స్‌లో పూర్తిగా విలీనం కావాలో, ఫ్రెంచి యూనియన్‌లోనే పరిమిత స్వాతంత్ర్యంతో ఉండాలో, లేక ఫ్రాన్స్‌తో పూర్తిగా తెగతెంపులు చేసుకొని స్వతంత్రంగా ఉండాలో నిర్ణయించుకొనే అవకాశం ఆల్జీరియన్లకు కల్పించ గలమని డిగాల్ ప్రకటించారు. అయితే, ఈ విషయంలో వారికి ఏపాటి స్వేచ్ఛ ఉంటుందనేది సందేహాస్పదం. ఆల్జీరియాలో క్రిందటిసారి ఎన్నికలు జరిగినప్పుడు, వాటి ఫలితాలు ప్రపంచంలో ఎవరూ నమ్మలేనట్లుగా ఉన్నాయి. ఆల్జీరియాలో ఫ్రెంచి సేనలు ఉన్నంత కాలం అక్కడ స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరగటం గాని, రిఫరెండం వంటిది జరగడం గాని అసంభవం. ఆల్జీరియాలో పోరాట విరమణ, ఫ్రెంచి సేనల ఉపసంహరణ ఏకకాలమందే జరగాలి. అప్పుడు గాని, ఆల్జీరియన్ జాతీయవాదులలో విశ్వాసం ఏర్పడదు. ఇంతేగాక, నాలుగేళ్ల వరకు వారిని వేచి ఉండమనటంలో కూడా అర్థం లేదు.

విద్యుచ్ఛక్తి సప్లయి స్కీములు

హైదరాబాద్, సెప్టెంబర్ 19

నిజామాబాద్ జిల్లా ఆర్మూరు తాలూకా గోవిందపేట, పాకాల్, నార్కోడ్ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సప్లయి స్కీమును రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు వారు మంజూరు చేశారు. దీని కయ్యే ఖర్చు రు. 1,66,900 లు.

ఇదే విధంగా ఖమ్మం, మహాబూబ్ నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాలలో గూడా మొత్తం రు. 24,83,000 లు ఖర్చు కాగల స్కీములు మంజూరు చేశారు.

మంజూరైన స్కీముల ప్రకారం ఖమ్మం జిల్లాలో చర్లగుంట, నేలకొండపల్లి వగైరా 9 గ్రామాలకు, ఖమ్మం పట్టణం లోని పారిశ్రామికాభివృద్ధికి విద్యుచ్ఛక్తి లభిస్తుంది. ఆత్మకూరు తాలూకాలో పేరూర్‌తో సహా నాల్గు గ్రామాలకు, మెదక్ జిల్లాలో తకాపురాన్, మరి అయిదు గ్రామాలకు, నిజామాబాద్ జిల్లాలో భీమగుల్, నిజాంపేట గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా అవుతుంది.

ట్రస్టీ తొలగింపు నోటీసు

హైదరాబాద్, సెప్టెంబర్ 17

గుంటూరు జిల్లా వినుకొండలోని పల్వాది నాగయ్యగారి ధర్మసత్రం నిర్వాహకులు, నిబంధనల నతిక్రమించి, ధర్మనిధులను దుర్వినియోగ పరుస్తున్నారనే ఆరోపణమీద, ఎందుకు తొలగించరాదో నవంబర్ 25లోగా సంజాయిషీ యిచ్చుకోవలసిందిగా ట్రస్టీకి నోటీసు యిచ్చింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

ఉస్మానియా యూనివర్శిటీ

ఉస్మానియా విశ్వవిద్యాలయం గత మార్చి నెలలో నిర్వహించిన ఎమ్. టెక్నికల్ (కెమికల్ ఇంజనీరింగ్) పరీక్షలో ఈ దిగువవారు మొదటిశ్రేణిలో ఉత్తీర్ణులైనారు: శ్రీ వి. గోపాలకృష్ణ, శ్రీ ఎన్. నరసింగరావు, శ్రీ ఎమ్. ఆనందరావు.

ధ్వని-ప్రతిధ్వని

అపర ధృతరాష్ట్రుడు!

అనగా అనగా ఒక రాజు. ఆ రాజుకు—భార్యలు. ఈ భాషిలో సరైన అంకె వేసిన వారికి ప్రత్యేక బహుమానం ఇవ్వవచ్చు. ఎందు చేతనంటే ఆ రాజుగారికి భార్య లెందరో ఇదమిద్ధంగా ఎవరికీ తెలియదు. రాజుగారికైతే సంఖ్యా వివరాలు తెలిసే ఉంటాయి.

అనగా అనగా అంటే ఎప్పుడో కాదు. ఇప్పుడే. రాజుగారు రాజుగారు కాదు. మాజీ రాజు. మిగతా కథ చెబితే, ఆయన ఎవరో మీరే సులభంగా ఊహించుకో గలరు. ఆయన రాణివాసంలో పెక్కండ్రు రాణులు ఉండేవారని ప్రతీతి.

భార్యలెంత మందో తెలియదు కాని, పుత్రుల విషయంలో మాత్రం ఆయన అపర ధృతరాష్ట్రుడు. ఆయనకు ఇప్పుడు రాజ్యంగాని, రాచకార్యాలుకాని లేవు కనుక కొంత మంది ఆయనను అపర ధృతరాష్ట్రుడంటే అనవచ్చు. సంతానయోగంవిషయంలోఆయనధృతరాష్ట్రుడు కంటే కూడా చాలా అదృష్టవంతుడని, గొప్పవాడని అంగీకరించక తప్పదు. కౌరవులు నూరుగురే. కాని ఈయన సెంచరీతో సరిపెట్ట లేదు. ఈయనకు 120 మంది పుత్రులని మనకు రూఢిగా తెలుసు.

ఈ విషయమైనా మనకు తెలియక పోయేదే. ఏ వార్తా దొరక నప్పుడు, మాజీరాజుల గురించి వాకబు చెయ్యటం పత్రికా విలేఖరులకు పరిపాటి. పూర్వం ఒక విలేఖరికి ఒక రోజున ఎంత గాలించినా వార్త దొరక్కపోయే సరికి, ఆత్మహత్య చేసుకొన్నట్టు వార్త పంపి, ఆ తర్వాత ఆత్మహత్య చేసుకుందామని మెరవు లాంటి ఒక ఆలోచన తట్టిందట. కాని ఆ వార్త పడిందో లేదో తెలుసు కొనటం అసాధ్యం గనుక తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడట. కాని ఈ సారి విలేఖరుల అదృష్టం పండి, ఈ వార్త వారిని వెతుక్కుంటూ వెళ్ళింది. మన అపర ధృతరాష్ట్రుని పుత్రులు లోకంలో ఇంత వరకు ఎవ్వరూ చెయ్యని పని చేశారు. వారంతా ఒక యూనియన్‌గా ఏర్పడి, తండ్రికి వ్యతిరేకంగా ఒక మెమొరాండం సమర్పించారు! ఒక విధంగా చూస్తే ఇది అంత అపూర్వమైన విషయం కానే కాదు. ధృతరాష్ట్ర మహారాజు పుత్రులు కూడా కలిసికట్టుగా ఉండే వారని మనకి తెలుసు. వారికి యూనియన్ లేదు కాని దుష్ట చతుష్టయం అన్నదీ నేటి కార్యనిర్వాహక వర్గం వంటిది. ఈనాడు కార్మికులు కార్మికేతర ప్రముఖులను అధ్యక్షులుగా ఎన్నుకుంటున్నట్లే, వారు కర్ణుని, శకునిని దుష్ట చతుష్టయంలోకి తీసుకున్నారు యూనియన్ అంటూ ఏర్పడితే, దాని సభ్యత్వం తెలియకుండా ఉండదు. ఇక వారు మెమొరాండం కూడా సమర్పిస్తే అది పత్రికలకు ఎక్కకుండా ఉండటం అసంభవం.

* * *

మాజీ రాజుగారు ఏ గొడవల్లోను ఇరుక్కోకుండా ఏదో "కృష్ణా రామా" అనుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఆయన కుటుంబ విషయాలు కెలకటం అనుచితమే. అయితే,ఆయన పుత్రులు ఒక యూనియన్‌ను ఏర్పాటు చేసుకొనటం, మెమొరాండం సమర్పించటం కుక్కను మనిషి కరవటం వంటిది- అంటే ఏతద్విషయానికి వార్తకు గల ప్రాముఖ్యం ఉన్నది. అందుచేతనే అన్ని పత్రికలు దానిని ప్రచురించినవి. సదరు మెమొరాండంలోని అభియోగాలను ఖండిస్తూ పితృపాదుల తరఫున ఒక ప్రకటన వెలువడింది. సాధారణంగా తండ్రి కొడుకుల మధ్య నలిగే వ్యవహారాలను గురించి పత్రికలుశ్రద్ధవహించవు. అవి "పబ్లిక్" వ్యవహారాలు కావు. కాని ఇది తీరా "పబ్లిక్" అయింది కనుక, ఇది లోకానికి నేర్పే గుణపాఠాలు ఏమైనా ఉన్నాయా అని ఆలోచించాలనటం అంత ఆక్షేపణీయమైన ఆలోచన కాదు.

ఆలోచించగా, ఆలోచించగా, నాకు రెండు విషయాలు స్పష్టమైనవి. నూరుగురు పుత్రులు కలిగి ఉన్న ధృతరాష్ట్రుడు చవట (అంటే విఫల మనోరథుడు) అనిపించుకొన్నాడు కాని, 16 వేల మంది గోపికలకు సమాధానం చెప్పుకోవలసి వచ్చిన శ్రీ కృష్ణుడు ఎన్నడూ పురుష లక్షణమైన ధీరోదాత్తతను పోగొట్టు కొనలేదు. కారణం? కారవ సంతానంతో వేగటం కష్టం కాని, బహు భార్యత్వాన్ని భరించటం కష్టం కాదు బహుభార్యత్వాన్ని నిషేధిస్తున్నాం, నిజమే. కాని దీనికి కారణం బానిసల్ల భార్యలకు జరుగుతున్న అన్యాయమే కాని భర్తలపై జాలిపడి కాదు. "ఇద్దరు పెళ్లాల మొగుడు" అనిఅంటూ వచ్చేరే కాని, "ఇద్దరు పిల్లల తండ్రి" అని జాలి పడటం జరగటం లేదు. సకల సంపదలు, సకల వైభవాలు గల ధృతరాష్ట్ర మహారాజు అంతటి వాడే పుత్రులను సన్మార్గంలో పెట్టలేక పోయాడంటే, ఈ రోజుల్లో కుచేల సంతానంతో బాధ పడేవారి దుస్థితి గురించి ప్రత్యేకించి చెప్పాలా? సంతానం ఎక్కువైన కొద్దీ సంతోషం తగ్గి, సంతాపం ఎక్కువ కావటం తథ్యం. ఇది కలికాలం. జనం ఎక్కువైన కొద్దీ కరువు ఎక్కువ కావటం తథ్యం. ఇది కలికాలం. జనం ఎక్కువైన కొద్దీ కరువు ఎక్కువ కావటం తథ్యం. దాంతో ప్రేమానుబంధాలు కూడా దెబ్బతింటాయి. ఇక రెండవ విషయం ఏమిటంటే సంతానయోగం పట్టడం అదృష్టమే అయినప్పటికీ, వారిని గాలికి వదిలివెయ్యటం కుటుంబానికి కాని, దేశానికి కాని క్షేమం కాదు. మహా వైభవంగా జీవితాలు గడుపుకొనటానికి నిషేపంలాంటి ఏర్పాట్లు చేసిన మాజీ రాజుగారిపై ఆయన కొడుకులు ఆరోపణలు చేశారంటే, పుత్రుల ముద్దు ముచ్చట్లు తీర్చటం అన్న సమస్య ఎంత క్లిష్టమైనదో విశదం కాగలదు.

— "కూచిమంచి"

సూర్యస్తవం చేసే విచిత్ర విగ్రహం

ఈజిప్టు దేశంలో ప్రాచీన కాలంలో గాన శక్తిగల ఒక విచిత్రమైన విగ్రహం ఉండేది. సూర్యోదయమవుతున్న సమయంలో ఆ విగ్రహంలోంచి జంత్రవాద్యం నుంచి వెలువడినట్లు స్వరాలు వెలువడుతుండేవట. కాని దానిని ఒక అద్భుతంగా పరిగణించవలసిన విషయం యేమీ లేదు. ఆ విగ్రహంలో స్వరాలను పలికే యాంత్రిక యేర్పాట్లు చేయబడ్డాయి. ఒకదానితో మరొకదానికి సంబంధంగల రెండు పాత్రలు ఆ విగ్రహంలో అమర్చబడ్డాయి. వాటిలో కొంతవరకు నీళ్లు ఉండేవి. ఉదయిస్తున్న సూర్యుని కిరణాలు ఒక పాత్రలోని గాలిని క్రమంగా వేడి చేసేవి. ఈ విధంగా వేడెక్కి వ్యాకోచించిన గాలి నీటి పైన వత్తిడిని కలుగజేసేది. అలా ఒత్తిడికి గురిఅయిన నీరు రెండవ పాత్రలోని నీటిని, గాలిని వత్తిడికి గురిచేసేది. రెండవ పాత్రలోని గాలి యీ విధంగా వత్తిడికి లోనై విగ్రహం తలలో అమర్చబడిన జంత్రవాద్యపు రంధ్రాల్లోకి ప్రవేశించేది. ఈ విధంగా ఆ విగ్రహం సూర్య "స్తవం" చేసేది.

సౌర శక్తిని మానవాభ్యుదయానికి వినియోగించుకోడానికి ప్రాచీన కాలం నుండి యేవిధంగా ప్రయత్నం జరుగుతూ వచ్చిందో యీ విషయం తెలియజేస్తుంది.

సూర్యమండలపు అపారశక్తి

భూమండలం చుట్టూ 1,000 కిలోమీటర్ల మందంగల మంచు ఉంటే దానిని ఒక గంట లోపల కరిగించివేయగల ఉష్ణశక్తిని సూర్య మండలం ప్రతి సెకెండుకు విడుదల చేస్తున్నది. కాని మన భూమండలానికి యీ ఉష్ణశక్తిలో అతి స్వల్ప భాగం మాత్రమే (రెండు వందల కోట్లలో ఒక వంతు మాత్రమే) వస్తుంది. ఇంత స్వల్పమైన దైనా అది భూమండలంమీది విద్యుత్ కేంద్రాలన్నీ కలసి ఉత్పత్తి చేస్తున్న విద్యుచ్ఛక్తి కంటే ఇరవై రెట్లు అధికం. ఇంతటి బ్రహ్మాండమైన శక్తి ప్రవాహాన్ని వినియోగించుకోవడం యెలా? సౌరశక్తిని ఇతర రూపపు శక్తిలోకి మార్చడానికి మానవుడు చేస్తూ వచ్చిన ప్రయత్నాలు బాగా పనిచేసే "కన్వర్టర్లు" లేకపోవడం వల్ల విజయవంతం కాలేకపోతూ వచ్చాయి.

విజ్ఞానశాస్త్ర, ఇంజనీరింగు రంగాలలో బ్రహ్మాండమైన అభివృద్ధి కలిగిన యీ రోజులలో మాత్రమే అది సాధ్యమవుతున్నది. సౌర శక్తిని విద్యుచ్ఛక్తిగాను, మెకానికల్ శక్తిగాను మార్చే పద్ధతులు ఇప్పుడు రూపొందింపబడ్డాయి.

"ఉష్ణ పేటికలు"

నీటిని 80—120 సెంటిగ్రేడ్ డిగ్రీలకు వేడి చేయగల "ఉష్ణ పేటికలు" ఇప్పుడు నిర్మింపబడ్డాయి. మామూలు కిటికీలకు వేయబడే గాజు పళ్లాలతో యీ "ఉష్ణ పెటికలు" నిర్మింపబడుతాయి.

జార్జియాలోని సగర్జి అనే గ్రామంలో సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి చెందిన సౌర స్నానశాలకు సౌర శక్తితో నీటిని వేడిచేసే యంత్రం ఒకటి యేర్పాటు చేయబడింది ఈ యంత్ర సహాయంతో స్నానశాలకు సంవత్సరం పొడుగునా వేడి నీరు సరఫరా చేయబడుతున్నది. బాకులోని యంత్రాగారంలో గూడా సంవత్సరంలో ఎనిమిది మాసాలపాటు సౌరశక్తి వినియోగంతో వేడినీరు స్నానాలకోసం సరఫరా చేయబడుతుంది. ఈ పద్ధతిలో నీటిని వేడి చేయడానికి ప్రత్యేకంగా మనుష్యులను నియమించవలసిన అవసరం ఉండదు. నీరు చానంతటదే వేడెక్కుతుంది. కాని త్వరలోనే యీ పద్ధతి సంక్లిష్టమయినది. కాని త్వరలోనే యీ పద్ధతి సులభతరం కావచ్చు. ఈ విధంగా సౌరశక్తిని కూడబెట్టి అవసరమైన విధంగా వినియోగించుకోడానికి అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయి.

మూడవ స్పూత్నిక్‌లో సౌర విద్యుద్ఘటాలు

మూడవ స్పూత్నిక్‌లో ప్రప్రథమంగా సౌర విద్యుద్ఘటాలు అమర్చబడ్డాయి. అవి స్పూత్నిక్‌లోని "మయక్" ప్రసార యంత్రానికి విద్యుచ్ఛక్తిని సరఫరా చేస్తున్నాయి.

ఈ విద్యుద్ఘటాలు సౌరశక్తిని, విద్యుచ్ఛక్తిగా మార్చే అనేక "సిలికన్ ఫొటో సెల్లు"తో కూడిఉన్నాయి. సూర్యుని కిరణాలు దీనిపైన పడినప్పుడు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి ఔతుంది.

భూమండలపు వాతావరణానికి వెలుపల సౌర శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చడానికి మూడవ స్పూత్నిక్‌మీద జరిగిన యీ ప్రయోగం యీ రంగంలో ముమ్ముందు జరుగబోయే పరిశోధనలకు అత్యంతంగా తోడ్పడుతుంది.

సౌర విద్యుద్ఘటాలకు గొప్ప భవిష్యత్తు ఉన్నది. కొన్ని దేశాల్లో యిప్పుడు సౌర విద్యుద్ఘటాలతో పని చేసే రేడియోలు తయారు చేయబడుతున్నాయి.

సౌర శక్తితో నడిచే రైలు ఇంజన్లు, నౌకలు, మోటారు కార్లను ఇంజనీర్లు నిర్మించే రోజులు సమీపిస్తున్నాయి. వీటి పై భాగాల్లో శక్తివంతమైన సౌర విద్యుద్ఘటాలు అమరుస్తారు. రాత్రిపూట ఇవి పగలు కూడబెట్టిన శక్తితో పని చేస్తుంటాయి.

సౌర శక్తితో రవాణా సాధనాలు నడిచే కాలం ఇంకా యెంతోదూరంలో లేదు.

సౌర శక్తి వినియోగానికి సంబంధించిన సమస్యలను పరిశీలించడానికి ఆర్మీనియాలోని అరారత్ లోయలో సోవియట్ దేశ విజ్ఞాన శాస్త్ర పరిషత్తు ఒక సౌర కేంద్రాన్ని నిర్మిస్తున్నది 1,200 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే సౌర ఉష్ణ విద్యుత్ కేంద్రం ఇక్కడ నిర్మిస్తారు.

ఈ కేంద్రం ఒక కిలోమీటర్ వ్యాసరేఖతో కూడిన వలయాకారములో ఉంటుంది. ఆవలయంలో చుట్టూ 1,300 అద్దాలు ఉంటాయి. అవి వలయంమధ్య ఉన్న బాయిలర్ పైకి సూర్యరశ్మిని ప్రసరింపజేస్తుంటాయి. బాయిలర్‌లోని నీరు ఆవిరిగామారి, దాని సహాయంతో ఒక టర్బోజనరేటర్ పని చేస్తుంది, ఆకాశం మేఘావృతమై ఉన్న సమయంలోనూ, రాత్రిపూటా గూడా యీ టర్బోజనరేటర్ పని చేయడం కోసం పగలు సూర్యరశ్మిచేత వేడిచేయబడిన నీరు భూగర్భంలో భద్రపర్చబడుతుంది.

ఎన్. పొకిదోవ్

కచ్‌లో విద్యుచ్ఛక్తి కేంద్రం

రాజకోట, సెప్టెంబర్ 18

రెండవ పంచవర్ష ప్రణాళికలో ఒకటిగా, కచ్ జిల్లాలో 70 లక్షల 10 వేల రూపాయల ఖర్చుతో నిర్మితమైన విద్యుచ్ఛక్తి కేంద్రానికి కేంద్ర ఇరిగేషన్ ఉపమంత్రి శ్రీ జైసుఖ్‌లాల్ హాథీ నిన్న ప్రారంభోత్సవం జరిపారు. జిల్లాలో కల్లా పెద్దదైన యీ విద్యుచ్ఛక్తి కేంద్రంలో 6 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తవుతుంది.

బర్ కెట్టా, ఇటలీ, సెప్టెంబర్ 18

రెండు రోజుల క్రితం ఇక్కడ ఒక ఐదంతస్తుల మేడకూలి 52 మంది చనిపోయారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 17

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసన్ అండ్ సెంట్రల్ లాబొరేటరీని యిక నుంచి "రోగ నివారక వైద్య సంస్థ" గా పేరు మార్చుటకు ప్రభుత్వంవారు నిర్ణయించారు.

ఢిల్లీలో బాల భవన్ నిర్మాణం ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18

న్యూఢిల్లీలో కోట్లా రోడ్డులో 18 ఎకరాల విస్తీర్ణంలో బాలభవనం నిర్మాణాన్ని కేంద్ర పబ్లిక్ వర్క్స్ శాఖ ప్రారంభించింది. జిల్లా జెయిలు అధికారులు యింతవరకూ ఆ ప్లాటులో కూరగాయల తోట పెంచుతున్నారు. పేద కుటుంబాల లోంచి వచ్చిన పిల్లలకు యీ భవనంలో వినోద సౌకర్యాలు కల్పిస్తారు. వృత్తి కేంద్రంగా కూడా వుంటుంది. బాల భవనం కూడా బాలల శరణాలయం వంటిదే. అయితే, యిక్కడ ఆరోగ్యకరమైన వాతావరణంలో బాలల ఆట పాటలకు కావలసినంత చోటు ఉంటుంది. ఈ పథకం వుద్దేశాల కనుగుణంగా, యిక్కడి భవనాల నమూనాలు ఆర్భాటం లేకుండానూ, ఆధునికంగానూ వుంటాయి. భౌతికంగా చూస్తే, యీ భవనాల నమూనాలు బాలల చిత్త ప్రవృత్తికి మల్లేనే అతి సహజంగా ఉంటాయి. నమూనాలను రూపొందించిన శిల్పి శ్రీమాన్ సింగ్ ఎమ్. రాణా.

తీరిక సమయాల్లోవడ్రంగం,కుమ్మరం మొదలైన వృత్తి పనులు సరదాగా చేసుకునేందుకు యీ భవనంలో ఎనిమిది గదులున్నాయి. వర్ణచిత్ర రచన, నృత్యాలూ, బృందగానం-వీటికి కూడా అక్కడ అవకాశ ముంటుంది. శరీర దార్ఢ్యాన్నీ, నాయకత్వ లక్షణాలనూ పెంపొందించేందుకు వ్యాయామ శాల కూడా ఉంటుంది. అన్ని వయోవర్గాల బాలలకూ ప్రయోజనకరంగా ఉండేటట్లు యీ కార్యక్రమాలన్నింటినీ సమన్వయపరుస్తారు. బాలల పుస్తకాలు గల ఒక చిన్న గ్రంథాలయాన్ని కూడా నిర్మిస్తారు. 300 మంది బాలలు పనిచేయడానికి వీలుండే ఒక కాఫ్టేరియా వుంటుంది. చిన్న పరికరాలూ, చిన్న చిన్న యంత్రాలనూ వుపయోగించడంలో అక్కడ వారికి తర్ఫీదు యిస్తారు.

ఈ భవనాలలో ముఖ్యమైనవాటిలో ఒకటి సైకిళ్ళుగల రంగస్థల మందిరం. ఇది అష్ట భుజాకారంగా వుంటుంది. స్టేజిమీద ఒకవైపున ద్వార ముంటుంది. ఒకేసారి 100మంది ప్రదర్శించ డానికి వీలుండేటంత పెద్దదిగా వుంటుంది రంగస్థలం.ప్రధానరంగస్థలానికి రెండుపక్కలా స్టేజీలూ, ఒక వెనుక స్టేజి వుంటుంది. 35 అడుగుల వ్యాసం గల తిరిగే పళ్ళెం మాదిరి స్టేజీని కట్టాలని కూడా తలంపు. రంగస్థలానికి సమీపాన బాలలకూ, బాలికలకూ ప్రత్యేకంగా గ్రీన్ రూములుంటాయి. ఈ ప్రదర్శన మందిరంలో దాదాపు 800 మంది బాలలు కూర్చోవడానికి వీలుంటుంది. వెయ్యి మంది కూర్చునేందుకు అవకాశముండేటట్లు విసిన కర్రను బోలిన ఒక బహిరంగ రంగస్థలాన్ని నిర్మించాలని కూడా తలపెట్టారు.

చిన్న చిన్న స్టేషన్లూ, రైలింజన్ల పెట్టెలూ, సొరంగాలూ, వంతెనలూ యీ మొదలైనవి వున్న ఒక పిల్లల రైల్వే పిల్లలను అక్కడి నుంచి యిక్కడకూ, యిక్కడనుంచి అక్కడకూ త్రిప్పుతూ ఆనందాన్ని కలుగజేస్తుంది. అన్ని భవనాలూ, ఈత కొలనూ, వ్యాయామశాలా, కాఫ్టేరియా, బహిరంగ రంగస్థలమూ, కాలక్షేప మందిరాలూ, నిబ్బంది వసతులూ—యివన్నీ చూపిస్తూ ఆ రైలు ఆ యా భవనాలమధ్య తిరుగుతుంది. దీనిని ఉత్తర రైల్వేవారు యిదివరకే నిర్మించారు. బాల భవనానికి కానుకగా యిచ్చారు.

పొదుపు ఉద్యమం కారణంగా యీ నిర్మాణాల కార్యక్రమాన్ని దశలవారీగా సాగిస్తారు. మొదటిదశ నిర్మాణాలలో కాలక్షేప మందిరాలూ, ఆఫీసు వసతీ, గ్రంథాలయమూ, డైరెక్టరు వసతీ, నిబ్బందికి వసతులూ వుంటాయి. బహిరంగ రంగస్థలం, వ్యాయామశాల, కాఫ్టేరియా, ఈత కొలను—వీటిని తరువాత నిర్మిస్తారు.

ప్రపంచ జంత్ర వాద్య పరికరాల ప్రదర్శన

షికాగో, సెప్టెంబర్ 18

షికాగో నేచురల్ హిస్టరీ మ్యూజియానికి వచ్చే ప్రేక్షకులు పలు దేశాల తాలూకు రకరకాల జంత్ర వాద్యాలను చూడవచ్చును. ఎందుకంటే మ్యూజియం అధికారులు "ది మ్యూజిక్ మేకర్స్" (సంగీతకారులు) అనే పేరుతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఆసియా, ఆఫ్రికా, ఓషియానియాల లోని దేశాలనుంచి వివిధ సంగీత వాద్యాలను చూపుతున్నారు. ఉత్తర, దక్షిణ అమెరికన్ ఖండాలలోని రెడ్ ఇండియన్ల జంత్ర వాద్యాలను కూడా దీనిలో చూడవచ్చును. అనేక ఆధునిక జంత్ర వాద్య పరికరాలకు ఈ రెడ్ ఇండియన్ల వాద్య పరికరాలు మాతృకలు.

ఈ జంత్ర వాద్యాలన్నీ కూడా తంత్రీ, మృదంగ, మురళి జాతులకు సంబంధించినవి. జంత్ర వాద్యాల మధ్య ఉన్న పెద్ద తేడాలను స్పష్టంగా చూపించి, ప్రతివారు కూడా ఏదో ఒక సంగీతం వల్ల ఆనందానుభూతి పొందుతూ ఉంటారని నిరూపించటం ఈ ప్రదర్శన లక్ష్యం.

ఆయా దేశాల జంత్ర వాద్యాలను నిపుణులచేత వాయింపించి, రికార్డు చేశారు. ప్రతిరోజూ మూడు సార్లు వీటిని ప్రేక్షకులకు వినిపిస్తారు.

మ్యూజియానికి ప్రక్కనున్న గ్రాండ్ పార్కులో బుధ, శుక్రవారాలలో జంత్రవాద్య కచేరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కచేరీలకు వచ్చేవారు ప్రదర్శనాన్ని కూడా చూడటానికి ఆ రెండు రోజులలోను సాయంత్రం వేళ ప్రదర్శనాన్ని తెరచి వుంచుతామని మ్యూజియం డైరెక్టర్లు చెప్పారు.

నాగార్జున సాగర్ క్రింద సహకార సేద్యానికి రిజర్వు బ్యాంకు సహాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 18

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రాంతంలో సహకార వ్యవసాయాభివృద్ధికి రిజర్వు బ్యాంకు ఆర్థిక సహాయం చేస్తారు. సహకార పద్ధతిన 10 వేల ఎకరాల భూమిని సాగులోకి తెచ్చేందుకుగాను ఆ యా సహకార సంఘాలకు ఆర్థిక సహాయం లభిస్తుంది.

కొంత కాలంక్రితం నాగార్జునసాగర్ కంట్రోలు బోర్డు అధికారులు రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్‌తో జరిపిన సంభాషణల ఫలితంగా యీ సహాయం లభిస్తోన్నది. దీనికి సంబంధించిన స్కీములు తయారు చేయుటకుగాను సహకార సంఘాల రిజిస్ట్రారు శ్రీ కె. సుబ్రహ్మణ్యం నాయుడుగారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. సహకార వ్యవసాయ సంఘంలో చేరే సభ్యులకు యిప్పటికి వున్న రుణాలు అన్నీ తీర్చుకోటానికి ఆర్థికంగా తోడ్పడి, భావి వ్యవసాయాభివృద్ధికి పెట్టుబడిగా అప్పులివ్వటం యీ స్కీముయొక్క ప్రధాన లక్ష్యం.

ఎన్నికల ఖర్చు తగ్గింపుకు కృషి

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17

ఎన్నికల ఖర్చు తగ్గటానికి వీలుగా స్క్రూటినీ, పోలింగ్ తేదీల మధ్య గడువు కాలాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యవర్గం ఎన్నికల కమిషన్‌కు సూచించినట్టు నేడు ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించబడింది.

ఓటర్లని వాహనాల మీద తీసుకు వెళ్ళటం, ఓట్లు కొనటం మొదలైన వాటిమీద చట్ట రీత్యా ఉన్న నిర్బంధాలను పూర్తిగా పాటించబడేటట్లు చూడాలని కమ్యూనిస్టు పార్టీ కోరినది.

ప్రజా సోషలిస్టు పార్టీ వారైతే అన్నిటి కంటె ముందు ముఖ్యంగా ఓటర్లలో "ఓట్ల చైతన్యం" కలిగి దాని విలువను వారు గుర్తించేట

విజయవాడ ఆసుపత్రి సమస్య

ముఖ్యమంత్రికి మెమొరాండం

విజయవాడ, సెప్టెంబర్ 16

విజయవాడ పురప్రముఖులు, సర్వశ్రీ టి.యస్. రామారావు (ప్రెసిడెంట్ లయన్సు క్లబ్) బచ్చు వెంకటేశ్వర్లు (కామర్స్ చేంబర్ అధ్యక్షులు) తేలప్రోలు వెంకటేశ్వర్లు (బట్టల వర్తక సంఘ అధ్యక్షులు) యస్.ఆంజనేయులు, తుమ్మలపల్లి జగన్నాథం (బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు) శాకరపర్తి భావనారాయణ (హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు) జంధ్యాల దక్షిణామూర్తి (మున్సిపల్ మాజీ చెయిర్మన్) టి. ఆదివారాయణ (ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఎగ్జిబిటర్ల సంఘం కార్యదర్శి) చెరుకూరు ఆంజయ్య (రైసు మిల్లు యజమానుల సంఘ అధ్యక్షులు) పి. యస్. గిరి (ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు) గత ఆదివారం ముఖ్య మంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి వద్దకు రాయబారంగా వెళ్ళి, ఆసుపత్రికి గాను నిర్ణయించబడిన కొత్త స్థలంలో నవీన పరికరాలతో కొత్త ఆసుపత్రి కట్టించాలని, అందుకు పౌరుల తరఫున ఇస్తామని వాగ్దానం చేసిన విరాళంలో దిగుబాటైన రెండు లక్షల రూపాయలు వసూలుచేసి యిచ్చేందుకు 1960 మార్చి దాకా గడువు పొడిగించాలని కోరుతూ మెమొరాండం సమర్పించారు.

చేనేత ప్రతినిధుల సమావేశాలు

గుంతకల్లు, సెప్టెంబర్ 17

చేనేత వస్త్ర వ్యాపారంలో యేర్పడిన మాంద్యం కారణంగా కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలోని చేనేత పారిశ్రామికులలో యేర్పడిన నిరుద్యోగ పరిస్థితిని నివారించుటకు గాను, రాష్ట్ర చేనేత సహకార సంఘం వారు, స్థానిక సంఘాలవద్ద నిల్వవున్న బట్టనంతా వెంటనే ఖరీదుచేయాలనియు, స్థానిక సంఘాలకు రావలసిన రిబేటు సత్వరం మంజూరు చేయించాలనియు శ్రీ ఇనుకుర్తి వీరభద్రరావు, ప్రగడకోటయ్య గారలను నిన్న యిక్కడ కలుసుకున్న అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల చేనేత ప్రముఖులు కోరారు.

ఆయా జిల్లాల చేనేత సమస్యలను చర్చించుటకు అనంతపురం జిల్లా ప్రతినిధుల సమావేశం 22 వ తేదీ హిందూపురములోను, కడప జిల్లా సమావేశం కడపలో 23 వ తేదీనను, జరిపించవలసిందిగా రాష్ట్ర చేనేత సహకార సంఘాధ్యక్షులు శ్రీ వీరభద్రరావుగారు ఆయా జిల్లా రిజిస్ట్రార్ రిజిస్ట్రారులను కోరియున్నారు. ఆ సమావేశాలలో చేనేత డైరెక్టర్ శ్రీ జోసఫ్ రెడ్డి, ప్రగడ కోటయ్య గారలు కూడా పాల్గొంటారు.

మోనపాడు స్కూలు భవనం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 15

జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ సి. సోమసుందరం మోనపాడు గ్రామంలో నేడు ఒక స్కూలు భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంలో జరిగిన సభకు శ్రీమతి జయలక్ష్మి దేవమ్మ అధ్యక్షత వహించారు.

సభలో శ్రీ పాగాపుల్లా రెడ్డి, శ్రీ కె.కె.రెడ్డి, శ్రీ ప్రతాపరెడ్డి, బ్లాక్ డవలప్‌మెంటు ఆఫీసర్ శ్రీ కొండారెడ్డి గారలు కూడా ఉపన్యసించారు.

గ్రామాల మార్పిడి

హైదరాబాద్, సెప్టెంబర్ 19

గుంటూరు జిల్లా, ఒంగోలు తాలూకా పెళ్లూరు సబ్ తాలూకానుంచి నెల్లూరు జిల్లా దర్శి తాలూకాకు మార్చబడిన కృష్ణాపురం, పెద ఉయ్యాలవాడ, చిన్న ఉయ్యాలవాడ అనే మూడు గ్రామాలను దర్శి తాలూకా వాత్తక మూరు ఫిర్కాలో చేర్చుటానికి ప్రభుత్వం ఆదేశించింది.

"నవశక్తి" పై మంత్రి జె. వి. అభియోగాలు

విచారణ జరపటానికి వీలులేదని కోర్టు తీర్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 18

నవశక్తి పత్రికా నిర్వాహకులపై శ్రీ జె. వి. నర్సింగరావు తరఫున దాఖలైన వరువునష్టం అభియోగాలు విచారణ చేయటానికి వీలులేదని హైదరాబాద్ జిల్లా అడిషనల్ జడ్జి శ్రీ ఎ.డి.వి. రెడ్డి నేడు తీర్పు యిచ్చారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం ప్రభుత్వ కార్యదర్శి అనుమతి పొందకుండా యీ అభియోగాలు దాఖలయినవాయని ముద్దాయిల తరఫున ప్రాథమిక అభ్యంతరం చేయబడగా, జడ్జిగారు పై విధంగా తీర్పు యిచ్చారు. కాని యింజనీర్లు శ్రీ బాలకృష్ణ, కీ॥ శే॥ బి. ఆర్. సోమయాజులుగార్ల తరఫు అభియోగాలు సక్రమంగా వున్నందున అవి విచారణకు తీసుకో బడునని అదే తీర్పులో పేర్కొన్నారు.

కమతాల బిల్లు

సాక్ష్యాల సేకరణకు కమిటీ పర్యటన

హైదరాబాద్, సెప్టెంబర్ 19

1958 ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమతాల గరిష్ఠ పరిమితి బిల్లు పట్ల ఆసక్తివున్న వ్యక్తుల నుంచీ, సంస్థల నుంచి సాక్ష్యాలనూ, విజ్ఞాపనా పత్రాలను సేకరించుటకు గాను ఈ బిల్లుకు సంబంధించిన సంయుక్త సెలక్ట్ కమిటీ వారు ఈ క్రింద పేర్కొనబడిన ప్రదేశాలలో ఆయా తేదీలలో సమావేశమౌతారు: గుంటూరు అక్టోబర్ 22, కర్నూల్ అక్టోబర్ 24, వరంగల్ అక్టోబర్ 27, నిజామాబాద్ అక్టోబర్ 28. ప్రతి చోటా కూడా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి 12-30 గంటల వరకూ, తిరిగి పనులు 2-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు కొనసాగుతాయి.

ఈ కమిటీ ముందు సాక్ష్యం ఇవ్వదలచిన లేక విజ్ఞాపనా పత్రాలు సమర్పించదలచిన వ్యక్తులు లేక సంస్థలు ఆ విధంగా చేయవచ్చును.

మంత్రుల పర్యటనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17

పబ్లిక్ వర్క్స్‌శాఖ మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు నేడు ధవళేశ్వరానికి చుట్టుపట్లగల వరదదెబ్బ తగిలిన ప్రదేశాలను చూచిన తరువాత విజయవాడకు బయలుదేరుతారు. ద్రోణాచలం, అనంతపురం, కర్నూలులకు వెళ్ళి సెప్టెంబరు 21వ తేదీన హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

మంత్రిగారు తిరిగి సెప్టెంబర్ 21 వ తేదీ సాయంత్రం నాగార్జునసాగర్ ఆనకట్ట స్థలానికి వెడతారు. సెప్టెంబర్ 22 వ తేదీన తిరిగి వస్తారు.

* * *

కోర్టులు, జైళ్లు, న్యాయ శాఖ మంత్రి శ్రీ గ్రంధి వెంకటరెడ్డి నాయుడు సెప్టెంబర్ 21వ తేదీ ఉదయం 11 గంటలకు సూర్యాపేట, విజయవాడ మార్గంగా ఏలూరు బయలుదేరుతారు. అచ్చటి నుంచి నర్సపూర్, దొడ్డిపట్లలకు వెడతారు. పశ్చిమ గోదావరి జిల్లాలో వరద దెబ్బతగిలిన ప్రదేశాలను చూస్తారు. 1959 అక్టోబర్ 1వ తేదీ రాత్రి 9గం. లకు నల్లజర్ల, ఏలూరు, విజయవాడల మార్గంగా హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

* * *

వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ సి. తిమ్మారెడ్డి సెప్టెంబర్ 26వ తేదీ రాత్రి నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, కాళహస్తి, తిరుపతి, తిరుమలై, పాకాల, దామల చెరువు, పాతూరు, పాలకలక్రాస్ రోడ్డు, కల్లూరు, పైలేరు, గ్యారంపల్లి, కలకడ, రాయచోటి, సంబేపల్లి, చిన్న మాన్యం, గుర్రంకొండ, వాయల్పాడు, మదనపల్లి, పుంగనూరు, పలమనూరు ప్రదేశాల పర్యటనకు బయలుదేరుతారు. వారు సెప్టెంబరు 29 వ తేదీ ఉదయం 11 గంటలకు చిత్తూరు చేరుకుంటారు.

రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడి సంస్థ

హైదరాబాద్, సెప్టెంబర్ 18

గత మార్చి (1959)తో అంతమైన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ పారిశ్రామిక పెట్టుబడి సంస్థవారి ఆర్థిక సహాయమునర్థించే దరఖాస్తులుచాలావచ్చాయి. ఈ సమీక్షా కాలంలోరు. 15,94,000లు అప్పుగా వివిధ పరిశ్రమలవారికి యీ సంస్థ అప్పులిచ్చింది. ఈ సంస్థ నిర్మాణం నాటినుండి యింతవరకు (మార్చి 1959) పెట్టుబడుల మొత్తం రు1,43,22,500లు అయింది.

కార్మిక సంఘాల నమోదు

హైదరాబాద్, సెప్టెంబర్ 17

తూర్పు గోదావరి జిల్లా విశాఖపట్నం మునిసిపల్ ఉద్యోగుల పనివారలసంఘం కార్మిక సంఘాల చట్టం క్రింద నమోదు చేయబడింది. ఈ సంఘానికి శ్రీయుతులు ఎం. భవనాచారి, వై. పకీం గారలు అధ్యక్ష కార్యదర్శులు.

లిఫ్టన్ ఉద్యోగుల సంఘం, ఆంధ్ర 32-8-46 రాజాజీ వీధి, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాపై చట్టం క్రింద నమోదు చేయబడింది. ఈ సంఘానికి శ్రీ ఎం. కె. విశ్వనాథం అధ్యక్షుడు, శ్రీ కె. ఆదినారాయణ కార్యదర్శి.

గోల్కొండ సిగరేట్ ఫ్యాక్టరీ పనివారల సంఘం ఐ. ఎన్. టి. యు. సి. నారాయణగూడ, హైద్రాబాద్ కార్మిక సంఘాల చట్టం క్రింద నమోదు చేయబడింది. శ్రీయుతులు జి. సంజీవరెడ్డి, కన్నయ్యాలాల్ గారలు ఈ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తారు.

కరీంనగరం జిల్లా వ్యవసాయ కూలీల సంఘం కరీంనగరం ఐ. ఎన్. టి. యు. సి. కార్యాలయం కరీంనగరం పై చట్టం క్రింద నమోదు చేయబడింది. ఈ సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీయుతులు జి. సంజీవరెడ్డి, పి. అప్పారావు గారలు వ్యవహరిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ బస్సు డిపోకి ఎదురుగా గల ఆంధ్రప్రదేశ్ భంగీల సంఘం, కార్మిక సంఘాల చట్టం క్రింద నమోదు చేయబడింది. ఈ సంఘానికి శ్రీ జి. అర్జున్ కుమార్ అధ్యక్షుడు, శ్రీ సర్వరాజ్ షరీఫ్ కార్యదర్శి.

కారులపై వేగాతిక్రమణ నేరం

హైదరాబాద్, సెప్టెంబర్ 18

హుసేన్ సాగర్ చెరువు కట్టపై నిర్ణీత వేగము నతిక్రమించి నడుపుతున్న 200 మంది మోటారు డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసులు కేసులు దాఖలు చేశారు. వారిలో 12 మంది ప్రభుత్వ బస్సులవారు కూడా వున్నారట.

జనరల్ కరియప్ప రేడియో ప్రసంగం

హైదరాబాద్, సెప్టెంబర్ 19

ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రం నుంచి సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి 8-45 గంటలకు విశ్వవిద్యాలయాల కొరకు "లక్ష్మీబాయి వ్యాయామ విద్యాకళాశాల" అనే విషయంపై జనరల్ కె. ఎం. కరియప్ప ప్రసంగాన్ని ప్రసారం చేస్తారు. ఈ ప్రసంగాన్ని హైదరాబాద్ ఎ, బి కేంద్రాల నుంచి వినవచ్చును.

జీనుగరాలలో వినోబా భావే జయంతి

పరవస్తి, సెప్టెంబర్ 17

వనపర్తి తాలూకా జీనుగరాల గ్రామంలో 11 సెప్టెంబర్ 1959 దివసం విశ్వనాథ జయంత్యుత్సవము మహా వైభవోపేతంగా జరుపబడినది. ఉదయం శ్రీ మహమ్మద్ ఖాశిం బాలబాలికలతో ప్రతి ఇంటికి పప్పు దాన రూపకంగా ధాన్యం సేకరించారు. మధ్యాహ్నం స్థానిక ఆంజనేయుల దేవాలయంలో శ్రీ విశ్వనాథం శాస్త్రి గీతా పారాయణం చేశారు. సాయంత్రం 4 గంటలకు భావే చిత్ర పటం ఊరేగింపు తీశారు. 8 గంటలకు పట్వారి శ్రీ వెంకట్రావు అధ్యక్షతన బహిరంగ సమావేశం జరిగినది. శ్రీయుతులు బాలస్వామి, శంకరయ్య, స్థానిక ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య ఉపన్యసించారు. శ్రీ కె. బాల్ రెడ్డి ప్రార్థన చేశారు.

ఆకాశవాణి

సోమవారం, సెప్టెంబర్ 21, 1959

హైదరాబాద్ [ఎ]

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-40 భక్తిరంజని 7-15 శంకర్: సితార్ 7-45 సంగీతశిక్షణ 8-30 హిందుస్థానీ సంగీత పాఠం 1-00 పి. సుందరమ్మ 1-30 శంకర్: సితార్ 2-00 వేణువు: నిలయవిద్వాంసుడు 2-20 మాధ్యమిక పాఠశాలలకు (ఉర్దూ) 3-45 మాధ్యమిక పాఠశాలలకు.

సా॥ 7-15 కవాలీ (ఉర్దూ) 7-30 విశ్వ విద్యాలయాలకు, 9-30 సత్యాన్వేషి: నాటిక, రచన: అడపా రామకృష్ణారావు.

బి

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 2-10 లలిత సంగీత్: ఎ. మురళీధరరావు 2-20 పి సుందరమ్మ.

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 ఫిల్మ్ పాట (రికార్డులు) 9-15 లలిత్ సంగీత్: ఎ.మురళీధరరావు.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-40 భక్తిరంజని 7-15 హైదరాబాద్ వలె

మ॥ 1-00 నిస్సారీ వలుస్సేన్ ఖాన్ 1-30 వీణా ధనం 3-45 ఉన్నత పాఠశాలలకు.

సా॥ 7-15 గ్రామస్థుల కార్యక్రమం 7-30 టి. కేశవులు: వయొలిన్ 9-15 నవీన గుర్జుపుసంత 9-30 సత్యాన్వేషి.



సారథీవారి "భాగ్యదేవత" లో రాజసులోలన.

తరతరలు

కొత్తూరు సీతయ్య గుప్త దుకాణం

శనివారం, 19-9-1959

ఉస్మాన్‌గంజ్, హైదరాబాద్	అం.	ప్ర.
సన్న బియ్యము	72-0-0	78-0-0
దొడ్డి బియ్యము	60-0-0	66-0-0
అక్కులు ,,	64-8-0	66-12-0
19 నెం. బి॥	65-0-0	66-12-0
తెల్ల జొన్నలు	48-8-0	51-8-0
చప్టి ,,	42-8-0	44-0-0
పచ్చ ,,	39-0-0	—
పసుపు	55-0-0	100-0-0
కందులు	58-0-0	66-0-0
ఎర్ర కందులు చి॥	49-0-0	52-11-0
పెసలు	45-8-0	52-8-0
మినుములు	48-0-0	53-0-0
శనగలు	42-0-0	48-0-0
ఉలవలు	36-0-0	36-12-0
బెల్లము	67-0-0	85-0-0
మిర్చి	210-0-0	310-0-0
చింతపండు	125-0-0	165-0-0
ఉల్లిగడ్డ కొ॥	8-0-0	14-12-0
గోధుమలు	83-8-0	87-0-0
నువ్వులు	93-0-0	105-0-0
ఇలాతిపలుకుచి॥	చ1665-0-0	—
ఆముదాలు	62-8-0	—
పత్తిగింజలు	37-0-0	43-8-0
నూనె	17-12-0	—
కందినప్పు పె॥	85-0-0	89-0-0
కందిపప్పు చి॥	75-0-0	80-0-0
మినప పప్పు	72-0-0	74-0-0
పెసర పప్పు	73-0-0	75-0-0
శనగ పప్పు	52-0-0	53-0-0
సిరిశనగ పప్పు	60-0-0	76-0-0
లంకపప్పు	53-0-0	54-0-0
ధనియాలు	127-8-0	142-8-0
ఇలాతికాయ	35-0-0	38-0-0

పెండి, బంగారం ధరలు

దెబ్బడ ఘామయ్య నారాయణ.

ఫోన్: నెం. 5260

తేజాపు బంగారం		121-50
కిసాన్ మార్క్ బి॥		121-75
వెండి తు॥	100 కి	203-00
వెండి తు॥	1 కి	2-05
నవరసు		79-50

కాలేజీలలో సీట్ల కేటాయింపు

మైసూర్ ప్రభుత్వం ఉత్తర్వు చెల్లనేరదని హైకోర్టు తీర్పు

బెంగుళూరు, సెప్టెంబర్ 18

విద్యా విషయకంగా, సాంఘికంగా వెనుక బడిన తరగతులను నిర్ణయిస్తున్న మైసూరు ప్రభుత్వం ఉత్తరువు రాజ్యాంగ విరుద్ధమనీ, అది రాజ్యాంగానికి ద్రోహం తలపెట్టటమే అవుతుందనీ మైసూర్ హైకోర్టు వారు నేడు తీర్పు యిచ్చారు. సాంకేతిక, శిక్షణ కళాశాలలో ప్రవేశం కోరిన నల్గురు విద్యార్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి శ్రీ యస్.ఆర్. దాస్ గుప్త, న్యాయ మూర్తి హోంబిగౌడ గారలు యిచ్చిన తీర్పులో యింకా యిలా వుంది;

ఈ విషయంలో ప్రభుత్వం వారి ఉత్తరువు నిరంకుశంగా వున్నది. వెనుక బడిన తరగతులు నిర్ణయించటంలో ప్రభుత్వంవారు యేక విధానమును (సూత్రాన్ని) అనుసరించలేదు.

ప్రభుత్వం వారు వెనుక బడిన తరగతులను నిర్ణయిస్తూ, రెండవ తూరి గావించిన నిర్ణయ ప్రకటన పత్రాన్ని, మొదటి ఉత్తర్వుతో కలిపి చదివితే, అది కుల వివక్షతలకు సంబంధించినదని పిస్తుందే గాని సాంఘికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన వారికి సంబంధించినదిగా వుండదన్నారు.

రుద్రపరంలో గణేశోత్సవాలు

బోధన్, సెప్టెంబర్ 16

ఇక్కడ రుద్రపరం గ్రామంలో వినాయక చవితినాటి నుంచి చిన్నటి వరకు గణేశ నవరాత్రోత్సవాలు ప్రతి నిత్యం నృత్య, గీత, వాద్యాలు; భజనలతో వైభవంగా జరిగాయి. నిన్న సాయంత్రం గణేశుని ప్రతిమ ఊరేగింపు, అన్నదానము జరిగినవి.

ప్రాచ్యభాషలలో శిక్షణ తరగతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19

సుల్తాన్ బజార్ హైస్కూలులో ప్రాచ్యభాషా కళాశాలవారు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతులు రోజూ సాయంత్రం 6 గంటలనుంచి 9 గంటలవరకు నడుస్తాయి.

కార్మిక వివాదాలు, పరిష్కారాలు

123 సందర్భాలలో ఉభయ పక్షాలకు రాజీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15

1958 డిసెంబర్ 31 తో అంతమైన అర్ధ సంవత్సరంలో అడ్జుడికేటర్లు, ప్రిజ్యునలులు ఇచ్చిన 279 ముఖ్యమైన తీర్పులను పరిశీలించగా, వాటిలో 123 తీర్పులు, ఉభయ పక్షాలు కుదుర్చుకున్న రాజీలు ఆధారంగా యిచ్చినవని తేలింది. 21 తీర్పులు తప్ప తక్కినవన్నీ ప్రత్యేక కర్మాగారాలకు సంబంధించినవి.

తీర్పుల ఫలితంగా, పారిశ్రామిక కార్మికులకు చెల్లించే బోనసు, కరువు భత్యం, ప్రాతిపదిక వేతనాలలో వచ్చిన మార్పులను గురించి సమాచారం సేకరించే నిమిత్తం భారత ప్రభుత్వ కార్మిక సమాచార కార్యాలయం వారు యీ పరిశీలన జరిపారు.

1958 జూన్‌లో ఇచ్చిన తీర్పు ఫలితంగా పశ్చిమ బంగాలులోని జనపనార మిల్లులో కార్మికుల వేతనాలు సమీక్షా కాలంలో సవరించబడ్డాయి.

సికిందరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

సికిందరాబాద్, సెప్టెంబర్ 19

సికిందరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ మరియు లైసెన్సింగ్ స్పెషల్ కమిటీకి శ్రీ పద్మారావు చెయిర్మన్‌గాను, శ్రీ పి. శ్రీహరిరావు డిప్యూటీ చెయిర్మన్‌గానుపక్షగ్రీవముగా నిన్న ఎన్నికయ్యారు.

మీ గృహాలంకరణకు
అందమైన చేతిపని వస్తువులు, బిద్రీవేర్
తయారుచేయువారు:
శ్రీరామ్ ఫైన్ ఆర్ట్స్
పసిపాపలను ఆనందింపజేసే
రకరకాల అందమైన బొమ్మలు
సమంజసమైన ఖరీదులపై దొరుకును
హ్యాండిక్రాఫ్ట్స్ హౌస్
నాంపల్లి స్టేషన్‌రోడ్, హైదరాబాద్.
(Saba)

నేడే చూడండి! నేడే చూడండి!!
రుటుంబంకోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన
ఒక ఇల్లాలి గాథ...
రమణ్ బి. దేశాయ్ సమర్పించు
గృహలక్ష్మి
ఇంతకుముందు ఏ చిత్రంలోను లేనటువంటి పాము డాన్సు ఒక ప్రత్యేకత
పండరీబాయి, సాహుమోడక్, లలితాపావర్
ప్యారడైజ్ సికిందరాబాద్
ఆటల సమయాలు: 3-30, 6-30, 9-30
(Nima) — బాలాజీ పిక్చర్స్ రిలీజ్ —

CHINA NILGIRI'S LAMSA Chocolate Tea. FINE FLAVOUR BEST COLOUR CHOCOLATE TASTE SPECIAL BLEND High Grown Tea TRADE MARK
లంసా చాకొలేట్ టీ
లంసా చాకొలేట్ టీ
మంచి సుగంధము, రుచికి
లంసా చాకొలేట్ టీని
లాసా స్పెషల్ టీని
ఎల్లప్పుడు ఉపయోగించండి
అన్ని షాపులలోను దొరుకును
చైనా నీలగిరి టీ ఎంపోరియం
మొజంజాహి మార్కెట్, హైదరాబాద్
(B. N. P.)
CHINA NILGIRI'S Lasa Special Tea REGD TRADE MARK
లాసా స్పెషల్ చాయ
లాసా
స్పెషల్ చాయ

ట్రేడ్ మార్కుల హెచ్చరిక ప్రకటన



ఎక్స్‌ప్రెస్ బీడి ఫ్యాక్టరీ
గుడిమాత్తం (నార్త్ ఆర్కాట్ జిల్లా)
పేరుమీద దేశవ్యాప్తంగా వ్యాపారం చేస్తున్న నాక్లయింట్స్
ఎ. ఖాదర్ మొహిదీన్ అండ్ బ్రదర్స్

పేరిట, 1940 ట్రేడ్ మార్కుల చట్టం క్రింద 150777, 181765, 181766, 181767, 181768 రిజిస్టర్ నెంబర్లలో, 1942 ట్రేడ్ మార్కుల నిబంధనల నాల్గవ షెడ్యూలు యొక్క 84 వ తరగతిలో పేర్కొనబడి ఉన్న బీడీలకు సంబంధించి పైన తెలిపిన విధంగా రిజిస్టరు చేయబడినవని ఇందుకు సంబంధించిన వారందరికి తెలియజేయుడమైనది.

ఏ విధమైన డిస్‌క్లెయిమర్స్, పరిమితులు, షరతులకు కట్టుబడి ఉండకుండా ఈ రిజిస్ట్రేషన్ సంపూర్ణ హక్కులతో చేయబడినది.

పైన తెలిపిన ట్రేడ్ మార్కులన్నిటికీ ఒకదానికొకటితో సంబంధమున్నది. వీటి విశేషమైన ముఖ వైఖర్లు సామూహికంగాను, విడివిడి గాను కూడి పొందుపర్చబడి ఉన్నవి.

అందువలన, ఇండియన్ యూనియన్‌లో ఎక్కడైన పైన తెలిపిన సరుకునకు సంబంధించి ఎవరైనా ఈ ట్రేడ్ మార్కులను గాని, లేకఅటువంటి సమానా గల వాటిని గాని, లేక రంగులలోనైనా సరే నకలు చేయడంగాని జరిపినట్లయితే, నాక్లయింటు పైన తెల్పిన మార్కులను ఉపయోగించడానికి గల హక్కును భంగపరచినవారగుదురు. ఈ విధంగా భంగపరచిన వారిపై చట్టరీత్యా సివిల్ లేక క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని ఈ ప్రకటన మూలంగా అందర్నీ హెచ్చరిస్తున్నాము.

ఎవరి మటుకు వారు ఈ విషయంలో అదుపులో ఉండగలరు.

వి. తె. మోహన్‌రాజ్,
ట్రేడ్‌మార్క్ అండ్ పేటంట్ అటర్నీ,
21/1, కెంపెగౌడారోడ్, ఎక్స్‌టెన్షన్, బెంగుళూరు.

అలంకార ప్రియులకు ముఖ్య సందేశం!
* ఫ్యాన్సీ అద్దాలు * చిరకాలం మన్నే ఆకర్షణీయమైన ఫ్రేములు * హార్డ్‌బోర్డ్ * సాఫ్ట్‌బోర్డ్ * ప్లైవుడ్ * క్యారంబోర్డులు
మావద్ద నాణ్యమైనవి లభిస్తాయి
ఒకసారి మా షోరూముకు వచ్చారంటే సంతృప్తి చెందకుండా తిరిగి వెళ్లరు
సెంట్రల్ గ్లాస్ ఎంపోరియం
ఫస్సీజంక్ మసీదు ఎదుట, నిజాంషాహి రోడ్, హైదరాబాద్.
(Jamsheed)

రుతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన
దేవీపిల్సు వాడండి
"దేవి పిల్సు" ముఖ్యంగా ఆలస్యమైన క్రమంగాకాక పోయిన బాధతొగూడిన, లేకఆగిపోయినబహిష్టుకు దేవిపిల్సు బాగుగ గుణంఇచ్చును
1. అధిక సంఖ్యలలోను కేసులు మూసివేయుమోసపుమందుగాను ఉపయోగించును...
2. వ్యాధులేమను అరోగ్యమునకు ఎల్లప్పుడు హానికలిగించును.
DEVI pills
SEENU & CO., 28, THANDAVARAYA GRAMANI STREET, MADRAS-21

నాలుగేళ్లలో ప్రపంచం అంతటా సేనలకు, ఆయుధాలకు పూర్తిగా స్వస్తి

పత్రికా స్వాతంత్ర్యం

కలకత్తా ప్రెస్ క్లబ్ అధ్యక్షుని విజ్ఞప్తి

కలకత్తా, సెప్టెంబర్ 18

అన్ని రాజకీయ పక్షాల వారు, ప్రభుత్వ అధికారులు అందరు కూడా అన్ని వేళలా, ముఖ్యంగా కల్లోల సమయాలలో సక్రియమైన వార్తలను విడుదలకు పంచుతూ, పత్రికా స్వాతంత్ర్యాన్ని సురక్షితం కొనుటలో తోడ్పడవలసిందిగా కలకత్తా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీ ఘోష్ నేడు ఒక విజ్ఞప్తి చేశారు.

ఇటీవల కలకత్తా నగరంలో జరిగిన ఆహారోద్యమం సందర్భంలో వార్తా సేకరణ లోను, ఫొటోలు తీసుకోవటంలోను పత్రికా ప్రతినిధులు అనేక యిబ్బందులకు గురి కావలసి వచ్చింది. అధికారులు, అనధికారులు కూడా తెలిసియో, తెలియకో గాని మొత్తానికి అనేక యిబ్బందులు కల్గించారు. కొన్ని సందర్భాలలో పత్రికా ప్రతినిధులను బెదిరించటము జరిగింది. వారు అడిగే ప్రశ్నలకు సరియైన సమాధానాలు యివ్వకపోవటమూ జరిగింది. మరికొన్ని సందర్భాలలో పత్రికా ప్రతినిధులకు కల్గించిన యీ అవరోధాల వల్ల యథార్థ వార్తలు సక్రమంగా అందక, పదంతుల వ్యాప్తికి దోహద మేర్పడిందని శ్రీ ఘోష్ తమ ప్రకటనలో అన్నారు.

నగరంలో నేడు

ఆంధ్రప్రదేశ్ హోమియోపతి వైద్య సంఘ సాధారణ సభ్యుల అత్యవసర సమావేశం హనుమాన్ టేక్డీలో వున్న దివ్యజ్ఞాన సమాజం హాలులో సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.

* * *

శ్రీ కృష్ణదేవరాయాంధ్ర గ్రంథాలయంలో శ్రీ నోరి నాగభూషణంగారి హరికథా కాలక్షేపం సా॥ గం 5-30 లకు.

పామర్రు, సెప్టెంబర్ 16

నేడు భారత సమితివారు కీ॥ శే॥ హరి నాగభూషణం స్మారక సభ జరిపారు. సభకు శ్రీ చాగంటి శరభయ్య అధ్యక్షత వహించారు.

ఐక్యరాజ్య సమితిలో శ్రీ కృశ్చేవ్ ప్రతిపాదన

ఐక్యరాజ్య సమితి, సెప్టెంబర్ 18

ప్రపంచంలోని రాజ్యాలన్నీ నాలుగేళ్ళలో పూర్తిగా ఆయుధ విసర్జన చెయ్యాలని సోవియట్ ప్రధాన మంత్రి శ్రీ నికిటా కృశ్చేవ్ నేడు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో ప్రతిపాదించారు.

శ్రీ కృశ్చేవ్ తన ప్రతిపాదనలను లని శ్రీ కృశ్చేవ్ అన్నారు. క్లుప్తంగా ఈ దిగువ విధంగా వివరించారు: కాల్బలాలు, వైమానిక, నావికా దళాలు పూర్తిగా అంతరించాలి; సైనికాధికారులను, యుద్ధ మంత్రిత్వ శాఖలను రద్దు చెయ్యాలి; యుద్ధతంత్రాన్ని శోధించే సంస్థలను ఎత్తి వెయ్యాలి; విదేశ సైనిక స్థావరాలను రద్దు చెయ్యాలి; అణ్వస్త్రాలను ధ్వంసం చేసి వాటి ఉత్పత్తిని పూర్తిగా నిషేధించాలి.

ఐక్యరాజ్యసమితి యొక్క మహోన్నత వేదిక నుంచి ప్రసంగించటానికి అవకాశం ఇచ్చినందుకు శ్రీ కృశ్చేవ్ పెద్దిగేట్లకు కృతజ్ఞత తెలుపుకున్నారు.

ఐక్యరాజ్యసమితిలో ప్రస్తుతం 80 దేశాలకు సభ్యత్వం ఉన్నదని, క్రిందటి ప్రపంచ యుద్ధంలో సమితి వ్యవస్థాపకులకు వ్యతిరేకంగా యుద్ధం చేసిన రాజ్యాలకు కూడా సమితిలో ప్రాతినిధ్యం ఉన్నదని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

ఐక్యరాజ్యసమితి ఏ లక్ష్యంతో స్థాపించబడినదో ఆ లక్ష్యాన్ని సమితి సాధించలేదని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

ప్రపంచం వివిధ ప్రాంతాలలో సైనిక ఘర్షణలు జరుగుతున్నవి. క్రిందటియుద్ధం తాలూకు బీభత్సాన్ని ఇంకా మరిచిపోని నేటి ప్రపంచం తిరిగి యుద్ధ మేఘాలతో ఆందోళనభరితమౌతున్నదని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

వివిధ రాజ్యాలవారు తమ విభేదాల కంటె తమను ఒండొరులను సన్నిహితం చేస్తున్న అంశాలపై దృష్టి మరల్చినప్పుడే విజయం సాధ్యమౌతుందని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

సిద్ధాంత రీత్యా విభేదాలు ఉన్నప్పటికీ, శాంతియుత సహజీవనానికి అవి ప్రతిబంధకాలు కాకుండా చూసుకోవాలి.

సాంఘిక, రాజకీయ వాద సభలలో గల విభేదాలను, తారతమ్యాలను గురించి అతిగా పట్టించుకొన్నట్లయితే, శాంతి సాధన యత్నాలు భగ్నం కావటం తథ్యమని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

ఏదో సూత్రాన్ని, సిద్ధాంతాన్ని పురస్కరించుకొని యుద్ధాలు జరిపే రోజులు పోయినవని, 20 వ శతాబ్దంలో ఇటువంటివి కొనసాగించినట్లయితే, మొత్తం మానవ జాతికే అపాయం సంభవించునని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

సహన భావం, నిజ్జత చాలా అవసరమని, ఎన్ని అభిప్రాయ భేదాలున్నా, అట్టి విభేదాలుగల రాజ్యాలు విజ్ఞతను, నిగ్రహాన్ని ప్రదర్శించాలని శ్రీ కృశ్చేవ్ ఉద్బోధించారు.

ప్రచ్ఛన్న యుద్ధాన్ని అంతమొందించాలని, ఇందుకు తీసుకోవలసిన మొదటి చర్య యుద్ధ నినాదాలకు స్వస్తి చెప్పటం లేదని శ్రీ కృశ్చేవ్ అన్నారు.

ఐక్యరాజ్య సమితిలో కమ్యూనిస్టు చైనాకు స్థానం ఇవ్వాలని కూడా శ్రీ కృశ్చేవ్ అభ్యర్థించారు.

పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న రాజ్యాల అభివృద్ధికి దోహదం చేయవలసిందిగా శ్రీ కృశ్చేవ్ ఐక్యరాజ్య సమితికి విజ్ఞప్తి చేశారు. ఈ కృషికి సోవియట్ రష్యా సహకారం లభించగలదని ఆయన హామీ ఇచ్చారు.

శ్రీ కృశ్చేవ్ తన ప్రసంగంలో నిరాయుధీకరణ సాధించటానికి పంచసూత్ర పథకాన్ని ప్రతిపాదించారు. దాని వివరాలు ఇవి:

1. పశ్చిమ యూరప్‌లో సైనిక బలాలను తగ్గించి కంట్రోల్‌కు, పర్యవేక్షణకు ఒక జోనును ఏర్పాటు చెయ్యాలి.
2. మధ్య యూరప్‌లో అణ్వస్త్ర రహిత మండలాన్ని ఏర్పాటుచెయ్యాలి.
3. విదేశ సేనల ఉప సంహరణ, సైనిక స్థావరాల రద్దు.
4. "నాటో" రాజ్యాలు, వార్సా సంధి రాజ్యాల మధ్య నిర్బంధ ఒడంబడికలు.
5. హఠాత్తుగా దాడులు జరగకుండా చూసుకొనటానికి ఒడంబడిక.

శ్రీ కృశ్చేవ్ ప్రసంగం ముగిసిన వెంటనే, అమెరికా విదేశాంగ కార్యదర్శి శ్రీ హెర్టర్ కృశ్చేవ్ ప్రతిపాదనలు కొత్తవి కావన్నారు.

శ్రీ కృశ్చేవ్ ప్రతిపాదనలను రేపో మాపో ఏర్పడనున్న నిరాయుధీకరణ సంఘం చర్చించవచ్చునా అని ప్రశ్నించగా, అట్టి అవకాశం ఉన్నదని శ్రీ హెర్టర్ అన్నారు.

"అంతా చర్విత చర్వణం"

(1 వ పేజీ తరువాయి)

చగా "ఆయన ప్రసంగంలోని కొన్ని అంశాలను నేను నా ప్రసంగంలో (గురువారం నాటిది) ప్రతిపాదించాను" అన్నారు శ్రీ సెల్విన్ లాయిడ్.

"చర్విత చర్వణం"

శ్రీ కృశ్చేవ్ చేసిన ప్రతిపాదనలు ఇంతకు పూర్వం సోవియట్ ప్రతినిధులు చేసినవేనని అమెరికా విదేశాంగ కార్యదర్శి శ్రీ క్రిస్టియన్ హెర్టర్ నేడొక ప్రకటనలో అన్నారు. స్థూలంగా చెప్పాలంటే, తగిన కట్టుదిట్టాలతో నిరాయుధీకరణ జరగాలని సూత్రాన్ని అమలు పరచటంలో అమెరికా మరియే ఇతర దేశానికి తీసిపోదని ఆయన అన్నారు.

శ్రీ కృశ్చేవ్ ప్రసంగం శుద్ధ ప్రచారం తప్పించి మరొకటి కాదని నెదర్లాండ్స్ విదేశాంగ మంత్రి, నాటో మంత్రి మండలి అధ్యక్షుడు అయిన శ్రీ జె. ఎమ్. ఎ. హెచ్. లన్స్ అన్నారు.

అమెరికన్ కాంగ్రెస్ వర్గాలలో సాధారణంగా ఏమనుకుంటున్నారో ప్రజా ప్రతినిధుల సభ స్పీకర్ శ్రీ సామ్ రేబరన్ చేసిన వ్యాఖ్యలో ప్రతిఫలించింది. ఆయన అన్న మాట లివి: "అందులో (కృశ్చేవ్ ప్రసంగంలో) కొంత భాగం బాగానే ఉన్నది. కాని, యూరప్‌లో, ముఖ్యంగా బెర్లిన్ విషయంలో, పరిస్థితులు ఇప్పటికంటె మరి కొంచెం చక్కబడితేనే కాని, ఆయన చెప్పినదంతా అంగీకరించటం కష్టం. అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, ప్రధాని కృశ్చేవ్ చర్చించటానికి ఇది చాలా యోగ్యమైన ప్రతిపాదన."

చికాగోలో డెమోక్రటిక్ పార్టీ ప్రముఖ నాయకుడు శ్రీ అడ్లాయ్ స్టీవెన్‌సన్ (ఈయన శ్రీ కృశ్చేవ్‌ను కలసుకోబోతున్నారు) సోవియట్ ప్రధాని చేసిన ప్రతిపాదనలను శ్రద్ధగా పరిశీలించాలన్నారు. శ్రీ కృశ్చేవ్ మనస్సులో ఒకటి పెట్టుకొని, బయటకు మరొకటి చెప్పాడనన్నదే ముఖ్యంగా యోచించవలసిన విషయం. అంతపూర్తిగా నమ్మకపోవటానికి కారణాలు ఉన్నప్పటికీ, ఆయన ప్రతిపాదనలను నిష్పాక్షికంగా పరిశీలించాలని ఆయన అన్నారు.

కాన్బరాలో ఆస్ట్రేలియా ప్రధాని శ్రీ మెంజిస్ సమితిలో శ్రీ కృశ్చేవ్ చేసినప్రసంగాన్ని పరిశీలిస్తేనేగాని దానిని గురించి ఏమీ చెప్పలేనని అన్నారు.

Edited by K. S. Subrahmanyam, published by Smt. Sita Yudhvir, and printed at the Janatha Trust Press, Gandhi Bhavan, Mukarampjahi Road, Hyderabad.

మధ్య ప్రదేశ్‌లో వరదల వల్ల 9 మంది మరణం

రెవెన్యూ మంత్రి ప్రకటన

భోపాల్, సెప్టెంబర్ 19

ఇండోర్, జబల్పూర్, రేవా డివిజన్లలో ఇటీవల వరదల ఫలితంగా 9 మంది మరణించారనీ, 150 మంది గాయపడ్డారనీ, 650 ఇండ్లు నేల మట్టమైనాయనీ మధ్యప్రదేశ్ రెవెన్యూ మంత్రి శ్రీ మండోలి నేడు శాసన సభలో ప్రకటించారు.

వరద బాధితులకు అన్ని విధాలా సహాయం జరుగుతున్నదనీ, రైతులకు విరివిగా తక్కావీ రుణాలివ్వాలనీ కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించినదనీ ఆయన వెల్లడించారు.

వివిధ ప్రాంతాలలో అతి వృష్టి కారణంగా చాలా భాగం పంటలు దెబ్బతిన్నట్టు కూడా ఆయన ప్రకటించారు.

మొరార్జీ దేశాయ్ లండన్ చేరు

లండన్, సెప్టెంబర్ 18

ఫ్రెంచి ఆర్థిక మంత్రి ఆంటియోనీ పినేతో సంభాషణలు జరిపి భారత ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ నేడు తిరిగి లండన్ చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో ఉండగా ఫ్రెంచి అధ్యక్షుడు జనరల్ డిగాల్‌తో కూడా వారు ఇష్టాగోష్ఠి జరిపారు.

పారిస్‌లో టెలివిజన్ ఇంటర్‌వ్యూలో మొరార్జీ మాట్లాడుతూ ఫ్రాన్స్ పారిశ్రామికంగా, వ్యావసాయికంగా చాలా అభివృద్ధి చెందిన దేశమని అంటూ ఇప్పుడు ప్రత్యేకంగా, ఆర్థికంగా నూతపటిష్టమైన దేశమని అన్నారు. భారత దేశం యింకా వెనుక బడిన దేశమేనని పారిశ్రామికాభివృద్ధి ద్వారా ప్రజలకు ఉద్యోగావకాశాలు పెంచుకోవాల్సి వుందని ఈ విషయంలో ఫ్రాన్స్ అనేక విధాల ఇండియాకు సహాయ పడవచ్చునని శ్రీ దేశాయ్ అన్నారు.

(శ్రీ) ఓ. పుల్లారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 19

కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ ఓ. పుల్లారెడ్డి నేడు ఇక్కడి యుద్ధ శిక్షణ పాఠశాలను సందర్శించారు.

పాఠశాల ఇటీవల రక్షణ మంత్రి శ్రీ వి. కె. కృష్ణమేనన్ ప్రారంభించిన విషయం పాఠకులకు విదితమే.

పాఠశాల అధికారి ఎయిర్ కమడోర్ సోంధి శ్రీ పుల్లారెడ్డికి స్వాగతమిచ్చారు.

ఢిల్లీ వెళ్ళేముందు సోమవారం నాడు ఆయన ఇతర సైనిక సంస్థలను చూస్తారు.

స్కౌట్ వనితల ఉత్సవం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19

మొట్టమొదటి సారిగా గత ఆదివారం భారత్ స్కౌట్స్, గైడ్సు జిల్లా మహిళా విభాగం వారు ఇక్కడ క్యాంపు నిర్వహించారు. వీరి కృషిని జిల్లా కలెక్టరు శ్రీ బి. వెంకటరత్నం గారు ప్రశంసించారు.

శ్రీ సుందరయ్య ప్రకటన

(1 వ పేజీ తరువాయి)

కించటమో, కొత్త సూచనలు చేయటమో జరిగినదని ఆయన అన్నారు.

వేతనాల సంఘం సిఫార్సుల పట్ల ఎన్. జి. ఓ. ల అసంతృప్తిని ఎదుర్కొన్న మీదట, ఉద్యోగులను తీల దీయటానికి, అణచి వేయటానికి ప్రభుత్వంపూనుకొన్నదని అందు వల్లనే పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, తాసిల్దార్లు, సెక్రటేరియట్ సూపరింటెండెంట్లకు జీతాలు హెచ్చించిమిగతా ఉద్యోగులకు ప్రభుత్వం అన్యాయం చేసినదనీ ఆయన విమర్శించారు.

మిగతా ఉద్యోగులకు కూడా జీతాలను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యూయార్క్‌లో క్రుశ్చేవ్‌కు వీడ్కోలు

న్యూయార్క్, సెప్టెంబర్ 19

తన పర్యటన వల్ల అమెరికా, రష్యా దేశాల మధ్య, నాయకుల మధ్య సంబంధాలు ప్రారంభమైనట్లు సోవియట్ ప్రధాని కృశ్చేవ్ నేడు ఇక్కడ అన్నారు.

ఐడిల్‌వైల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో లాస్‌ఏంజల్స్‌కు బైల్దేరే ముందు ఆయన పై విధంగా అన్నారు.

తనపట్ల స్నేహభావాన్ని ప్రదర్శించిన లక్షలాది ప్రజలకు ఆయనకృతజ్ఞతలు తెలిపారు. తన రాకపట్ల అసమ్మతి ప్రదర్శించిన వారు లెక్కకు కొద్దిమందేనని ఆయన అన్నారు.

ఉస్మానియా సెనేట్‌లో కాంగ్రెస్ సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19

ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనేట్‌కు వివిధ జిల్లాల స్థానిక సంస్థల నియోజక వర్గాల నుండి యీ క్రింది కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికయ్యారు:

సర్వ శ్రీ హీరాలాల్ మోరియా (ఖమ్మం). యం. బాగారెడ్డి (మెదక్). రఘునాథరావు (కరీంనగర్), ఇబ్రహీం అన్సారీ (మహబూబ్‌నగర్), కె. గోపాలరావు (వరంగల్). వీరమల్లప్ప (హైదరాబాద్), లక్ష్మీకాంతరావు (అదిలాబాద్), కోదాటి నారాయణరావు (నల్గొండ) గారలు.

చైనీస్ కాల్పులు

తైపీ, సెప్టెంబర్ 19

క్విమోయ్ దీవులపై కమ్యూనిస్టు చైనా నేడు తెల్లవారుజామున కొత్తరకపు గోళాలను ప్రయోగించినట్టు ఇక్కడ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించినది.

నేడే చూడండి! నేడే చూడండి!!

ముక్కోటి ఆంధ్రులను మైమరపిస్తున్న ఉత్తమ జానపద చిత్రం



పొన్నలూరి బ్రదర్స్ వారి

దైవబలం

(సగానికి పైగా కలరు)

నటీనటులు: ఎన్. టి. రామారావు, జయశ్రీ, రేలంగి, గిరిజ, రమణారెడ్డి, శివరావు, గిమ్మడి, ముక్కామల, మాలతి, బాల, పద్మినీ ప్రియదర్శిని.

దర్శకుడు: వసంత కుమార రెడ్డి

ప్యాలెస్ హైదరాబాద్ | రాజేశ్వర్ సికిందరాబాద్ | రాజరాజేశ్వరి వరంగల్

(Nima) ఆటల సమయాలు: 3-00, 6-15, 9-30. - నవయుగ రిలీజ్ -

నేడే చూడండి! :: నేడే చూడండి!!

ముద్దులొలికే అమాయకులైన ఈ పసిపాపల గాథను చూచి కలించని వారెవరైనా ఉంటారా? చూచి ఆత్మ విమర్శ చేసుకోండి.

సిప్పీ ఫిల్మ్స్ వారి

భాయి బహెన్

జానీవాకర్, డెయిసీ ఇరానీ, బేబీనాజ్, నిశీ, రెహమాన్, నీలోఫర్, అన్వర్ హుస్సేన్, షమ్మీ

రచన, దర్శకత్వం: జి. పి. సిప్పీ | సంగీతం: ఎస్. దత్తా | పాటలు: సాహిర్

అశోక్ హైదరాబాద్ | మనోహర్ సికిందరాబాద్

ఆటల సమయాలు: 3-30, 6-30, 9-30

(Trupix) — విజయ రిలీజ్ —

శరవేగంతో వస్తోంది!

చలనచిత్రాలలో విశేష కళాప్రజ్ఞను ప్రతిబింబింపచేసే చిహ్నం

It's Rajeanmal

* నవరంగ్ *

కనుల పండువైన టెక్నికలర్‌లో

నిర్మాత, దర్శకుడు: వి. శాంతారాం

1959 అక్టోబర్ 1వ తేదీనే విడుదల

ప్రభాత్ హైదరాబాద్, ఫోన్: 34543 | ప్యారడైజ్ సికిందరాబాద్, ఫోన్: 6964

(Nima) - అలంకార్ చిత్ర రిలీజ్ -

4వ దిగ్విజయ సంయుక్త వారం!

రాజశ్రీ ప్రొడక్షన్స్ వారి

శభాష్ రాముడు

సాగర్ హైదరాబాద్ | అలంకార్ సికిందరాబాద్

ఆటల సమయాలు: 2-15, 6-00, 9-30

మార్కండేయ వరంగల్ | రమేష్ నిజామాబాద్

(Nima) — రాజశ్రీ రిలీజ్ —

4వ దిగ్విజయ సంయుక్త వారం!

జంట నగరాలలోని ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న చిత్రం

పద్మినీ పిక్చర్స్ వారి

వీరపాండ్య కట్టబ్రహ్మన

(గేవాకలర్ తెలుగు చిత్రం)

శివాజీ గణేశన్, జెమినీ గణేశన్, ఎన్. వరలక్ష్మి, పద్మిని, రాగిణి

నిర్మాత, దర్శకుడు: బి. ఆర్. పంతులు | సంగీతం: మెకటావారి

కదుల్ హైదరాబాద్ | అజంతా సికిందరాబాద్

ఆటల సమయాలు: 2-30, 6-00, 9-30

తర్వాత చిత్రం రామ్మా వరంగల్

(Trupix) — శ్రీ సినీ కార్పొరేషన్ రిలీజ్ -

విజయవంతమైన 4వ సంయుక్త వారం!

మీ అభిమాన పాట "మొక్కజొన్న తోటలో" ఈ చిత్రంలో విని ఆనందించండి.

చందమామ ఫిల్మ్స్ వారి

సిపాయి కూతురు

జమున, సూర్యకాంతం, విజయలక్ష్మి, గుమ్మడి, నాగయ్య, బాలకృష్ణ, పేకేటి, పంగర, సత్యనారాయణ బి.ఏ., పెంపుడుకుక్క (ఝాన్సీ), గుర్రం (కల్యాణి).

దర్శకత్వం: పి. చంగయ్య బి.ఏ. | సంగీతం: ఎమ్. ఎస్. రాజు

దీపక్ మహల్ హైదరాబాద్ | చిత్ర సికిందరాబాద్ | లక్ష్మి వరంగల్

(Nima) ఆటల సమయాలు: 2-15, 6-00, 9-30 — పూర్ణా రిలీజ్ —